ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

**The Bombay Andhra Mahasabha & Gymkhana**

సంపుటి - 80 | సంచిక - 7 & 8 | సెప్టెంబర్ - అక్టోబర్ - 2014

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల..

# దర్పణం



## పాఠకులందరికీ

## దసరా, బతుకమ్మ, దీపావళి పర్వదిన శుభాకాంక్షలు

Advt.

# Sri Sai Enterprises

**CIVIL, ELECTRICAL ENGINEERS & CONTRACTORS**

(An ISO 9001: 2008 Certified Company)

Tel. (Off.): 022 6525 0965
Telefax : 022 2781 0463
Mob. : +91 93236 40922



Prop. Kasi Reddy

**Off.: Shop No. 14, Shivshankar Bldg.-II, Sector - 15**
**Plot No. 17, Sanpada, Navi Mumbai - 400 705**

**E-Mail: srisai_kreddy@yahoo.co.in**
**Website: www.srisaikreddy.com**

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

## The Bombay Andhra Mahasabha & Gymkhana

10-C, Lakhamshi Napoo Road, Dadar (E), Mumbai - 400014, Tel.: 24144377 / 24144388, Fax : 24119832

E-mail: mahasabha@gmail.com Web: www.thebombayandhramahasabha.com



# దర్పణం

**అధ్యక్షులు / సంపాదకత్వం**
సంకు సుధాకర్

**ప్రధాన కార్యదర్శి / సహకారం**
యాపురం వెంకటేశ్వర్

**పదాధికారులు**
అనుమల్ల రమేశ్
ఉపాధ్యక్షులు, పరిపాలనా శాఖ
గట్టు నర్సయ్య
ఉపాధ్యక్షులు, సాంస్కృతిక శాఖ
నడిమెట్ల యెల్లప్ప
ఉపాధ్యక్షులు, సాహిత్య, జింఖాన
రాపెల్లి పరమేశ్వర్
కోశాధికారి

యెలిగేటి రాజ్‌కుమార్
సంయుక్త కార్యదర్శి, పరిపాలనా శాఖ
శ్రీమతి రాధామోహన్
సంయుక్త కార్యదర్శి, సాంస్కృతిక శాఖ
వేముల మనోహర్
సంయుక్త కార్యదర్శి, సాహిత్య, జింఖాన
ఏ.వి. నాగేశ్వరరావు
పి. ఆర్. ఓ.
బడుగు విశ్వనాథ్
సహాయ సంపాదకులు

**సమన్వయ సంపాదకులు**
సంగెవేని రవీంద్ర

**సంపాదక సలహాదారులు**
ఏ. మల్లికార్జునరెడ్డి

**సహ సంపాదకులు**
డా॥ పాము మనోహర్


## ఒక మాట

**మ**హాసభ సభ్యులకు, శ్రేయోభిలాషులందరికీ నమస్కారం...!

సూర్యుడు దిగిపోని
ఎరుపైనా మిగుల్తుంది...
మబ్బులు కలబడనీ
మెరుపైనా మిగుల్తుంది...

– పైడి తెరేష్‌బాబు

ఏదైనా విజయం సాధించాలంటే సంఘర్షణ తప్పదు. ప్రగతిని సాధించడం అంటే కూడా ఒక సంఘర్షణే.. కానీ ప్రగతి ఎప్పటికీ ఆగదు.. సూర్యుడి దిగిపోయినా ఎరుపు మిగుల్తుంది. సంఘర్షణలోంచి ప్రగతిపథం రూపుదిద్దుకుంటుంది.

ఆంధ్రమహాసభను ప్రగతిపథంలో నడిపేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆగేది లేదు. సభ్యులందరీ సహాయ సహకారాలతో పాటు అభివృద్ధి ఆకాంక్షల నేపథ్యంలో మేం మహాసభలో ఆధునిక సౌకర్యాలతో పాటు ఈ మహారాష్ట్రలో మన తెలుగు కీర్తి పతాకను ఎగరవేసేందుకు మా వంతుగా మేం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం.

గదులన్నింటిని ఆధునీకరించడం, ఆహ్లాదకరమైన పరిసరాల్ని ఏర్పాటు చేయడం, గ్రంథాలయం, వ్యాయామశాల పునరుద్దరించడం లాంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. అలాగే దర్పణం క్రమం తప్పకుండా వెలువరిస్తున్నాం. అయితే ప్రభుత్వ అనుమతులు, సమాచార లోపం వంటి కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నా మేం మా ధర్మకర్తల మండలి, కార్యవర్గ సభ్యుల సహకారంతో అన్నింటిని అధిగమించి ముందుకు సాగుతున్నాం.

ప్రగతికాముకులున్నట్టే ప్రగతి నిరోధకాలు కూడా వెంటాడుతుంటాయి. సమాచారలోపం అడ్డంకిగా మారుతుంది. కానీ సమగ్రమైన ప్రణాళిక, పారదర్శికతతో ముందుకు వేసే అడుగులు రేపటి భవిష్యత్తుకు వెలుగుజాడలవుతాయనే ప్రగాఢ నమ్మకం మాకుంది.

తేది 12.10.2014 నాడు ఆంధ్రమహాసభలో చేపట్టే అభివృద్ధి పనుల అంశంపై నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మీరు మా సంకల్పాన్ని అర్థం చేసుకొని మా ప్రతిపాదనకు మద్ధతు ప్రకటించినందుకు మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుకుంటున్నాం.

పథం అగ్నిపూరితమైనా.. మీ సహకారం మాకు అభేధ్య కవచం
అభివృద్ధి అడ్డంకులమయమైనా... మా సంకల్పం మా వజ్రాయుధం..

సంకోచం వద్దు.. సందేహాలు అసలే వద్దు.. రండి.. పరస్పర సహకారంతో ముందుకు వెళ్దాం..

ఆంధ్రమహాసభకు పూర్వవైభవాన్ని తీసుకొద్దాం..

ధన్యవాదములతో....

**యాపురం వెంకటేశ్వర్**
ప్రధాన కార్యదర్శి.

**సంకు సుధాకర్**
అధ్యక్షులు

# అసంతృప్త ఆవేదన

– గాలి మురళీధర్

సాహితీ దర్పణం

ఏదో అవుతోంది..
నాలో నాకే తెలియని
ఏదో జరుగుతోంది..
వేదనేదో నిరంతరం
కార్చిచ్చై రగులుతోంది...
భౌతిక బాధలకు మూలమైన
ఆర్థికమా..?
సుఖాలకు మరిగిన దేహారోగ్యమా..?
కాదే.. అయినా కొలతే లేని కలత ఏదో..
అన్నీవున్నా అదృశ్య కొరత ఏదో...
శోధించాలి.. నాలో నన్ను పరిశోధించాలి..
ఎదుటివాడు ఎదుగుతున్నాడనో
ఎదుటివాడు ఎగురుతున్నాడనో
మెప్పులు ఒప్పులు పొందుతున్నాడనో
అతడి మెప్పులు నాకు రేపటి ముప్పులనో...
ఏదో.. ఏదో.. నిరంతర వేదన
మనిషిగా కుంచించుకుపోతూ
మనస్సును వంచించుకుపోతూ....

ఇక్కడ ఎందరో 'నేను'లు
పుట్టగొడుగులై పుడుతున్నారు
అటంబాంబులై పడుతున్నారు..
ఎలా తుంచను.. ఎలా అణచను..?
ప్రతిరోజూ ఈ 'నేను'ల నిప్పుల్లో
ఆవిరవుతున్నాను..
పడిలేచే కడలి తరంగంలా
విరిగిపోతున్నాను..
లోలోన జ్వలించే నిప్పుల
సునామీని అర్పాలి...
నన్ను నేనే కదిలించే ఆప్తుల
పంచన చేరాలి..
నాకు నేను పరాయిని కాకముందే
నన్ను నేను శోధించాలి..పరిశోధించాలి..
నాలో మరుగున పడ్డ
మనిషిని మరోసారి ఆవిష్కరించాలి...!!!

❀❀❀

### చాలా బాగుంది

దర్పణం పత్రికను తీర్చిదిద్దుతున్న తీరు చాలా బాగుంటోంది. తక్కువ పేజీలైన అన్ని అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా ఆగస్ట్ సంచికలో సంపాదకీయంలో అధ్యక్షులు సంకు సుధాకర్‌గారు ఉటంకించిన డా॥ ఎన్.గోపిగారి పద్యం నర్మగర్భంగా ఉంది. యాపురం వెంకటేశ్వర్‌గారి చవితి ముచ్చట్లు కూడా ఆలోచన రేకెత్తించే విధంగా ఉంది. సంపాదక వర్గానికి ధన్యవాదములు.

– చక్కరికోట నంద్‌కిషోర్

### గవర్నర్ పరిచయం బాగుంది

చాలా సంవత్సరాల తర్వాత మహారాష్ట్రకు మన తెలుగు వ్యక్తి గవర్నర్‌గా రావడం ఇంతో ముదావహం. ఈ సందర్భంగా సంగెవేని రవీంద్ర గవర్నర్ శ్రీ సీహెచ్ విద్యాసాగర్‌రావుగారి గురించి పరిచయ వ్యాసం ఎంతో సమాచారయుక్తంగా ఉంది. ఇలాగే అప్పుడప్పుడు మన తెలుగు తేజాల గురించి వివరిస్తే ఈ పరాయి రాష్ట్రంలో ఉంటున్న మన తెలుగువారికి ఎంతో సమాచారం అందించినవారవుతారు. మీ కృషి అభినందనీయం.

– ఝుఝుంఝుంసంఝుంఝు

### బాపు అమరుడే..!


ఆగస్ట్ సంచికలో మూగవోయిన తెలుగు గీత.. రాత.. చేత అనే వ్యాసం బాపుగారి గురించి చాలా చక్కటి వివరాలు అందించారు. ఈ వ్యాసకర్త బదుగు విశ్వనాథ్‌గారికి హృదయపూర్వక అభినందనలు. ఏ అందమైన అమ్మాయిని పొగడాలన్నా బాపు బొమ్మలాగా ఉన్నావు అనేవారు. అలాంటి చిత్రకారుడు మన తెలుగు గడ్డపై ఇక రావడం అనేది అసాధ్యం. బాపు లేని లోటు ఎవరూ పూడ్చలేరు. ఇలాంటి మహానుభావుల గురించి మీరు తరచుగా వ్యాసాలు ప్రచురిస్తే ఎంతో బాగుంటుందని మనవి చేస్తున్నాను.

– టసంటసటసంటంటసట

### బాగా నచ్చింది

ఆగస్ట్ సంచిక బాగా నచ్చింది. కవితలన్నీ బాగున్నాయి. గాలి మురళీధర్ రాసిన ఆత్మఘోష మమ్మల్ని ఆనందాశ్చర్యాలకు గురిచేసింది. కొత్త కవి అయినా ఎంతో పరిపక్వంగా రాశారు. ఆయనకు అభినందనలు. అంతేగాకుండా, నడిమెట్ల యెల్లప్ప రాసిన ముంబయిలోని తెలుగు కవితలు, భైరి రామస్వామిగారు రాసిన తీపి గురుతులు కూడా చాలా బాగున్నాయి. ఒక పూర్తిస్థాయి పత్రికలా తీసుకువస్తున్నందుకు సంపాదక వర్గానికి అభినందనలు..

– ఝుఝుంఝుంసంఝుంఝు






www.bamsg.org
mahasabha@gmail.com
Tel.: 022-4144377-88, Tel. Fax: 022-24119832

## యాపు 'రాంశం'



# వాటేజ్ దిస్..!!



**యాపురం వెంకటేశ్వర్**
ప్రధాన కార్యదర్శి.

**ఆ**ధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషికి పలు సౌకర్యాలతో పాటు అంతులేని ఇబ్బందుల్ని కూడా తెచ్చిపెట్టింది. ఒకవైపు అత్యాధునిక పరికరాలతో భౌతికంగా సుఖసముద్రంలో తేలియాడుతున్న మనిషి మరోవైపు అవే యంత్రాల వల్ల మనిషితనాన్ని కోల్పోతున్నాడు.

ముఖ్యంగా గత దశాబ్దకాలంలో సమాచార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా సెకండ్ల కాలంలో మరోమూలకు తెలిసిపోయే అత్యంత వేగవంతమైన వ్యవస్థలు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు దూరధ్వని ఇంట్లో ఉంటేనే ఎంతో గొప్పగా సమాచార ప్రసారాలు సాగేవి. ఆ తర్వాత వచ్చిన పేజర్ కొంతకాలం వెలుగు వెలిగింది. కానీ సెల్ ఫోన్‌లు రావడంతో పేజర్‌లు మూతబడిపోయాయి.

మనిషి సామాజిక జంతువు. పోటీ ప్రపంచంలో పరుగెడుతూ ఒంటరితనాన్ని మూటగట్టుకుంటున్నాడు. అలాంటి సమయంలోనే ఫేస్‌బుక్ రంగప్రవేశం చేసింది. దీంతో ప్రపంచంలోని పలుదేశాల వారితో స్నేహసంబంధాలు, మాటల మూటలు, పరస్పరం సమాచారం ఇచ్చిపుచ్చుకోవడాలు మొదలయ్యాయి. ఒంటరితనానికి అలవాటు పడుతున్న మనిషి, తన ఒంటరితనంలోనే ఫేస్‌బుక్ ద్వారా స్నేహసంబంధాలు కొనసాగించసాగాడు.

అయితే ఈ ఫేస్‌బుక్ మనిషిని మరింత ఏకాకి సముద్రంలోకి నెట్టివేసింది. ఇదొక వ్యసనంగా మారడం వల్ల కుటుంబ సభ్యులతో కనీసం మాట్లాడే అవకాశం కూడా సన్నగిల్లసాగింది. దాంతో అనివార్యంగా కుటుంబ వ్యవస్థకు బీటలు ఏర్పడసాగాయి. ఇదొక్కటే చాలదన్నట్లు ట్విటర్‌లు, చాటింగ్‌లు మరింతగా మనిషిని కుంచించుకుపోయేలా చేస్తున్నాయి.

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌ల వినియోగం విరివిగా పెరిగిపోవడం వల్ల వాట్సప్ మనిషిని మరుగుజ్జుగా మార్చేస్తోంది. నిజానికి ఈ ఆధునిక ఆవిష్కరణలన్నీ మనిషిని ప్రగతిపథంలో పరుగెత్తించేందుకు అద్భుతమైన సాధనాలే.. కానీ మనిషే వాటిని తన పతనానికి ప్రధాన కారణంగా మార్చుకుంటున్నాడు.

ఇప్పుడు ఎవరిని చూసిన వాట్సప్ లోకంలో నిండా మునిగి ఉంటున్నారు. పక్కనున్నవాడితో కూడా మాట్లాడకుండా వాట్సప్ లోకంలో విహరిస్తున్నాడు. ఒక్కోవ్యక్తి వంద గ్రూపుల్లో సభ్యుడిగా ఉంటూ అందులో వచ్చే సొల్లు కబుర్లకు, వల్గర్ చిత్రాలకు బానిసగా మారిపోతున్నాడు. స్మశానంలో ఉన్నా, సన్మానంలో ఉన్నా, వేదికపై ఉన్నా, సమావేశాల్లో ఉన్నా మనిషి నేడు వాట్సప్‌తో కాపురం చేస్తున్నాడు. రాన్రాను ఇదొక మానసిక రోగంగా పరిణమించే ప్రమాదం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

మనిషికి విజ్ఞానాన్ని అందించేందుకు ఆవిష్కరింపబడ్డ ఈ పరికరాలు మనిషిని క్రమక్రమంగా అధోగతికి తీసుకెళ్ళడం నిజంగా విషాదకరం. మనిషిని మనిషి ప్రేమించనినాడు, మనిషితో మనిషి సంవాదం మానేసిన నాడు ఎన్ని ఆధునిక పరికరాలు ఉన్నా అవన్నీ వ్యర్థమే..

మనుషులుగా ఉందాం.. మనుషులతో ఉందాం..! ఎంత ఆకర్షించిన యంత్రాలు మనిషికి సాటిరావు. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న వేదోక్తిని మరిచిపోకుండా పరిమితుల్లో ఉంటే మనిషితనం, మానవత్వం చిగురేస్తుంటాయని మనవిచేస్తున్నాను

## ఆంధ్రమహాసభలో

# మరమ్మత్తులకు సర్వసభ్యుల ఆమోదం



నిర్మించిన ప్రతిదానికి సమయానుబద్ధంగా మరమ్మత్తులు నిర్వహించడం అనివార్యం. ఆంధ్రమహాసభ భవనాన్ని నిర్మించితన తర్వాత ఇప్పటి వరకు పైపై మరమ్మత్తులు తప్ప మౌళికమైన మరమ్మత్తులు చేపట్టలేదు. పలు చోట్ల లీకేజీలతో పాటు పిల్లర్లు, బీంలు కూడా అక్కడక్కడ చెడిపోయాయి.

దీనివల్ల గదుల్లో, మిగతా చోట్ల లీకేజీలు సంభవించి గోడల్ని పైకప్పుల్ని చెడిపోయేలా చేస్తున్నాయి. అందుకే గత ఆరు నెలల నుండి ధర్మకర్తల మండలి, కార్యవర్గం అంతా కలిసి సంయుక్తంగా ఈ అంశాన్ని పరిశీలనలోకి తీసుకున్నారు. పలువురు నిర్మాణరంగ నిపుణులను సంప్రదించారు.


కొందరు అనుభవజ్ఞులైన పెద్దలతో ఒక దెవలప్‌మెంట్ కమిటీ కూడా వేసి వారి సలహాలను తీసుకున్నారు. అందరి అభిప్రాయాలకు అనుగుణంగా ఆంధ్రమహాసభలో పెద్ద ఎత్తున మరమ్మత్తులు నిర్వహించనట్లయితే రాబోయే కాలంలో ప్రమాదకరంగా మారడమే కాకుండా, మహాసభ ఆదాయం కూడా తగ్గే అవకాశాలున్నాయనీ, అంతేగాక పరాయి రాష్ట్రాల నుండి వచ్చే అతిథుల దృష్టిలో కూడా చులకన అయ్యే అవకాశాలు ఉన్నాయనీ, అందుకే మరమ్మత్తుల పనులు చేపట్టాలనీ ధర్మకర్తల మండలి, కార్యవర్గం సంయుక్తంగా తీర్మానించాయి.

ఇందుకోసం సభ్యుల అనుమతి కోరేందుకు తేది 12 అక్టోబర్ 2014 నాడు అత్యవసర సర్వసభ్యసమావేశం నిర్వహించారు.

ముందుగా మహాసభలో ఎక్కడెక్కడ ఎందుకు మరమ్మత్తులు నిర్వాహించాలో తెలిపే పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. వేదికపై ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంగం, కార్యదర్శి మంతెన రమేశ్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, కోశాధికారి రాపెల్లి పరమేశ్వర్ ఆసీనులయ్యారు.

తొలుత ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు. అధ్యక్షులు తన మలిపలుకుల్లో మహాసభ మరమ్మత్తుల గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత మరమ్మత్తుల అంశాన్ని చర్చకోసం సభ్యుల ముందు ప్రవేశపెట్టారు.

ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులెందరో తమ తమ అభిప్రాయాల్ని నిస్సంకోచంగా వెల్లడించారు. దాదాపు 1.25 కోట్ల బడ్జెట్‌తో నిర్వహించబోయే ఈ మరమ్మత్తుల ప్రాజెక్టు గురించి సభ్యులెందరో పలు సందేహాలను వ్యక్తపరిచారు.



మరమ్మత్తులు చేయాలనే అంశంపై ప్రతి ఒక్క సభ్యుడు అంగీకారం తెలిపినప్పటికీ... ఏ రకంగా ఈ పనుల్ని నిర్వహిస్తారు..? ఇందుకోసం పూర్తి సొమ్ము మహాసభనుండే వ్యయం చేస్తారా.. లేక విరాళాలు సేకరిస్తారా.. అనే అంశాలపై సభ్యులు ప్రధానంగా చర్చించారు.

పలు సందేహాలు.. వాటికి సరైన సమాధానాలు ఆపై మరమ్మత్తుల కోసం చేపట్టే ప్రక్రియలు లాంటి అంశాలపై తీవ్రంగా చర్చలు జరిగాయి. ఈ చర్చలన్నింటినీ వీడియో కెమెరాలో బంధించారు.

భోజన విరామం వరకు కూడా చర్చలు ఒక కొలిక్కి రాకపోవడంతో అధ్యక్షులు సంకు సుధాకర్ భోజన విరామాన్ని ప్రకటించి, మిగతా సమావేశాన్ని భోజనానంతరం నిర్వహిస్తామని ప్రకటించారు.

భోజనానంతరం కూడా చర్చ కొనసాగింది. సభ్యుల సందేహాలకు ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంఘం, కార్యదర్శి మంతెన రమేశ్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, కోశాధికారి రాపెల్లి పరమేశ్వర్ తమదైన రీతిలో సమాధానాలు ఇచ్చి సభ్యుల సందేహాలను తీర్చారు.

మరమ్మత్తులు ఎందుకు చేపట్టాల్సి వచ్చిందనే అంశంపై అధ్యక్షులు సంకు సుధాకర్ వివరణ ఇచ్చారు.

మరమ్మత్తు పనుల్లో జరిగే వ్యయం పట్ల అతిజాగ్రత్త వహిస్తామనీ, అన్ని విషయాలు పారదర్శికంగా ఉండేలా చూస్తామనీ, ఎక్కడా కూడా మహాసభకు నష్టం కలిగకుండా బాధ్యత వహిస్తామనీ, సర్వసభ్య అనుమతి లభించిన తర్వాత విరాళాల సేకరణకు ప్రయత్నిస్తామనే హామీతో ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంగం, కార్యదర్శి రమేశ్ మంతెన మరమ్మత్తుల అనుమతి కోరుతూ తీర్మానాన్ని సభికుల ముందు ప్రవేశపెట్టారు.

మెజారిటీ సభ్యులు చేతులెత్తి తీర్మానాన్ని ఆమోదించారు. దాంతో మరమ్మత్తుల పనులు చేపట్టాలనే తీర్మానం ఆమోదింపబడింది.

ధర్మకర్తల మండలి కార్యదర్శి సభికులకు ధన్యవాదములు, వందన సమర్పణ గావించారు.

❀❀❀

**సవరణ**

గత సంచికలో పేజి నం. 26లో ప్రచురింప బడిన "రాద్ధాంతోపాఖ్యానం" అనే కవిత ముంబయి చెందిన ప్రముఖ కవి ఎ.వి. అనంతరామ్ గారు రాసినదిగా గమనించగలరు

– సంపాదక వర్గం

# కాళోజీ..!

సాహితీ దర్పణం



–అక్కినపెల్లి దుర్గేశ్

కాళోజీ...
ఈ మూడు అక్షరాలు
ముక్కోటి తెలంగాణకు ఆదర్శం
తెలంగాణ భాస, యాసలకు
ముగ్గవోసిన తెలంగాణ ముద్దుబిడ్డ
కాళోజీ...!

సమ్మక్కసారక్కల
ధిక్కార పోరాటం
రాజీపడని తత్వాన్ని
వారసత్వంగా ఎత్తుపట్టిన
ఓరుగల్లుని పోరుగల్లుగా నిలిపిన
తెలంగాణ అమరజ్యోతి కాళోజీ...

కష్టజీవుల చెమట చుక్కలు
కడుపుమండిన కన్నీటికథలు..
గోడుగోడనే గొడవలన్నీ
తన గొడవగా చేసుకున్న
తెలంగాణ దారిదీపం కాళోజీ...

దోపిడి లేని సమాజలక్ష్యం కోసం
తన కలం నుండి కవితాగ్నులు కురిపించి
ప్రతి అక్షరాన్ని బడుగుజీవుల
ఆయుధంగా మలిచిన
తెలంగాణా పోరాటస్ఫూర్తి కాళోజీ....!!

❀❀❀

ధర్మకర్తల మాట

# ధన్యవాదములు

**తేది 12 అక్టోబర్ 2014 నాడు నిర్వహించిన అత్యవసర సర్వసభ్యసమావేశంలో సభికులంతా మరమ్మత్తుల తీర్మానానికి మద్దతు పలికి ఆమోదించినందుకు హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుకుంటున్నాం.**

మహాసభ మనందరిది. వ్యక్తులు కొంతకాలం ఉంటారు. వెళ్ళిపోతారు. కానీ సంస్థలు చిరకాలం ఉంటాయి. తరతరాలుగా మన జాతి గౌరవాన్ని, భాషా సంస్కృతుల్ని కాపాడే సంస్థల్ని వ్యక్తులుగా మనం కాపాడుకోవాల్సి ఉంటుంది. పదవులు కేవలం అలంకారం కోసం కాకుండా అమూల్యమైన వారసత్వ సంపదను కాపాడే కర్తవ్యంగా భావించిన నాడే అధికారానికి అసలైన అర్థం చేకూరుతుంది.

అందుకే మేం కేవలం అధికారాన్ని ప్రదర్శించుకోకుండా, మహాసభలో అత్యవసరంగా నిర్వహించాల్సిన మరమ్మత్తులపైన దృష్టి సారించాం. నిజానికి ఈ మరమ్మత్తులు పది సంవత్సరాల క్రితమే నిర్వహించాలి. కానీ, కారణాలు ఏవైనా ఆ దిశగా ఎందుకో ఎక్కువగా కృషి జరగలేదు. దానికి తోడు గత మూడు నాలుగు సంవత్సరాల నుండి కొన్ని వివాదాల వల్ల మహాసభ మరమ్మత్తుల పనులు నిలిచిపోయాయి.

కొత్త కార్యవర్గం అధికారం చేపట్టిన తర్వాత అంధ్రమహాసభలో మరమ్మత్తుల పనుల అంశాన్ని సుదీర్ఘంగా పరిశీలించాం. ఎందరో నిపుణులను సంప్రదించాం. చివరకు ఒక ప్రణాళికతో మీ అనుమతి కోరుతూ మీ ముందుకు వచ్చాం.మీ సందేహ నివారణ తర్వాత మీరు విశాలమైన హృదయంతో మహాసభను మన గౌరవప్రతీకగా భావించి, మరమ్మత్తుల కోసం మేం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించినందుకు మీకు మరొక్కసారి ధన్యవాదములు.

ముున్ముందు కూడా మీకు ఎలాంటి సందేహాలు ఉండాల్సిన అవసరం లేదు. పూర్తి పారదర్శికంగా పలువురు పెద్దలతో ఒక కమిటీ వేసి, వీలైనంత వరకు విరాళాలు సేకరించి, అంధ్రమహాసభను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మరమ్మత్తులు నిర్వహిస్తామనీ హామీ ఇస్తున్నాం.

మీరు 1.25 కోట్ల వ్యయానికి అనుమతి ఇచ్చినప్పటికీ మేం వీలైనంత మట్టుకు తక్కువ వ్యయంతో చక్కని మరమ్మత్తులు నిర్వహిస్తామనీ, వసతి గదుల్ని కూడా అధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామనీ,ప్రపంచ తెలుగు ప్రజలు గర్వించేలా అంధ్రమహాసభ కీర్తిప్రతిష్టల్ని పెంచేందుకు ప్రయత్నిస్తామనీ మరొక్కసారి మీకు సవినయంగా విన్నవించుకుంటున్నాం.

ఈ సందర్భంగా మీకు మరో విషయం కూడా మనవి చేయాలనుకుంటున్నాం.. అదే మన మహాసభ లీజు విషయం.

లీజు గురించి గత కొన్ని సంవత్సరాలుగా మన మహాసభలో ఎన్నో వాదాలు, వివాదాలు చెలరేగిన విషయం మీకు తెలిసిందే. అయితే మేం బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేపట్టిన అంశాల్లో లీజు కూడా ఉంది. గతంలో మహాసభ ప్రతినిధులు లీజు విషయంలో తీసుకున్న చర్యల్ని, సంబంధిత అధికారులతో జరిపిన పత్రవ్యవహారాల్ని మేం క్షుణ్ణంగా పరిశీలించాం. గత పత్రవ్యవహారాల ఆధారంగా మేం కూడా పలువురు అధికారుల్ని, రాజకీయ నాయకుల్ని సంప్రదించాం.

చివరగా లీజు అంశాన్ని పరిష్కరించే అత్యున్నత అధికారి ............. ని మేం అంటే, ఏక్‌నాథ్ సంగం, మంతెన రమేశ్, పోతు రాజారాం, ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్ తో సహా వెళ్ళి కలిసాం. అన్ని పత్రాలు పరిశీలించి, మా విన్నపాన్ని సానుకూలంగా విన్నతర్వాత ఆయన చెప్పిందేమంటే... 'లీజు రెన్యూవల్ అనేది ప్రభుత్వ పాలనావిధానానికి చెందినది. ప్రస్తుతం ముంబయిలో ప్రభుత్వం ఏ సంస్థకు చెందిన లీజును కూడా రెన్యూవల్ చేయడం లేదు. తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకు లీజు రిన్యూవల్ చేసేందుకు వీల్లేదు. మీకు సంబంధించిన వరకు పత్రవ్యవహారాలన్నీ సక్రమంగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలు లభించగానే రిన్యూవల్ లీజుల్లో మీది ముందు వరసలో ఉంటుంది. అంతదాకా, మీరు ఎవరినీ కలిసినా, ఎంత ప్రయత్నించినా లీజు రెన్యూవల్ అయ్యే అవకాశమే లేదని...' తేటతెల్లం చేశారు.

సభ్యులకు మేం చేసే మనవి ఏమనగా, ఈ వాస్తవాన్ని మీరు గ్రహించి, లీజు విషయంలో కావాలనీ కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని మీరు నమ్మొద్దనీ, ఈ అంశం పై ధర్మకర్తల మండలి, కార్యవర్గం పూర్తి అప్రమత్తంగా ఉన్నామనీ, ప్రభుత్వ విధానాలు మారగానే మన లీజు వెంటనే రెన్యూవల్ అవుతుందనీ మీకు మనవి చేస్తున్నాం.

మీ సహాయ సహకారాల్ని సర్వదా ఆకాంక్షిస్తూ... ధన్యవాదములతో..

భవదీయులు

**ఏక్‌నాథ్ సంగం**
(ఛైర్మెన్)

**మంతెన రమేశ్**
(కార్యదర్శి)



# PG

**INVESTMENT SHOP**

*Professional Insurance & Investment Consultant*

*Gangadhar Pillamarapu*

**Mo. 9004039150, 9322218929**

**E-mail : pginvestus@yahoo.com**

# I Can Help You!

## ☑ Select your Long time pending issues

- ☐ Your Insurance policy Lapsed/ Surrender/ Maturity/ Loan/ any Correction
- ☐ Any Mediclaim issues Cashless/ Reimbursement/ Portability
- ☐ Insurance for Two & Four Wheeler
- ☐ Looking for New Passport or Renewal for Assistance
- ☐ Income Tax Return Employee/ Business
- ☐ New Pan Card or Correction in Pan details etc.,
- ☐ Mutual Fund Redumption/ New Investment
- ☐ Change of Name to Gazette
- ☐ Make a Senior Citizen Card
- ☐ Any Others for your requirement :

- ❖ Just Pay Rs.6405/- Health Insurance Cover Rs.7 Lacs 2A + 2C
- ❖ Compulsary deductable Rs.3 Lacs, for age upto 60 yrs.
- ❖ LIC's New Plan JEEVAN ANAND, Jindagi Ke Saath Bhi.. Jindagi Ke Baad Bhi..
- ❖ Just Pay Rs.1292/- Rs.10 Lacs PA cover & more

ఆపాత మధురం

దర్పణం

- జి.ఎస్. ప్రకాశ్‌రావ్

# తీపి గురుతులు




## ఆ పాత మధురాలు ఎలా మర్చిపోతాను....

అది 1964వ సంవత్సరం, క్రొత్తగా కాకినాడ నుంచి బొంబాయికి వచ్చాను. 'ఘాట్‌కోపర్'లో మా మేన మామగారివద్ద ఉండేవాడిని. 8వ తరగతి చదివాను - చైల్డ్ ఆర్టిస్ట్‌ని, చిన్నప్పట్నుంచి నాటకాలలో పిల్లల పాత్రలు వేసేవాడిని. నాటకాలంటే నాకు ప్రాణం. అవి లేకపోతే నాకు తోచేది కాదు. నాటకాల కోసం అని వెతుక్కుంటు ఆంధ్రమహాసభకి చేరాను.

ఇక్కడ నాటకాలు వేసేవారిని పరిచయం చేసుకున్నాను. ఆ రోజుల్లో చాలా గొప్ప నాటకాలు వేసేవారు. ఆంధ్రమహాసభలో నాటకం అంటే జనం క్రిక్కిరిసి పోయేవారు. ఆరోజుల్లో శ్రీకూచిమంచి వెంకటేశ్వర్లు, ఎమ్.జి.చారి, ఆర్.ఎమ్.సింగ్, దర్శకత్వం వహిస్తూ ఉండేవారు నాటకాలకు ! నా నాటకాల అనుభవం వారికి తెలియ చేసాను. నాటకాల వారంతా నన్ను అక్కున చేర్చుకున్నారు. నేనంటే వారికి చాలా ఇష్టం. నన్ను బాగా చూసుకునేవారు.

మెంబరుగా చేరాను. అప్పుడు నా వయస్సు 17 సంవత్సరాలు. మహాసభలో అందరికంటే చిన్నవాడిని నేనే. మిగతా సభ్యులంతా చాలా పెద్ద ఉద్యోగస్తులు. చిన్న పెద్ద అనే బేదం లేకుండా కలసి పనిచేసే వాళ్ళం. నేనున్న రోజుల్లో "భాగ్యనగరం", "పేరయ్యరాజంట", "మహారుద్రీయం", "పట్టాలు తప్పిన బండి", "మరో మొహంజోదారో" నాటకాలు వేశాం. అంతా సమిష్టిగా పని చేసేవారు. మహాసభకి ఉద్యోగస్తులు ఎవరూ లేరు ఉన్నా "పార్ట్‌టైం" మాత్రమే ! నాటకాలలో చిన్న చిన్న వేషాలు వేస్తూ మనం నిర్వహించే "సావనీరు"కి రావలసిన చెక్స్ కంపెనీలకి వెళ్ళి తెచ్చేవాడిని. ఎక్కడైనా తెలుగు సినిమాలు ఉంటే అక్కడికిపోయి నాటక కరపత్రాలు పంచి పెట్టేవాడిని. సభ్యులంతా చాలా మంచివారు.

సభ్యుల సంఖ్య చాలా తక్కువ. చదువు కోటానికి గ్రంథాలయంలో కొంతమంది ఉండేవారు. అనేక మంది తెలుగు వారు పై ఊళ్ళనుంచి మన మహాసభకి 'వసతి' కోసం వచ్చేవారు. ఒక మనిషికి అయిదు రూపాయలు తీసుకునే వాళ్ళం. గ్రూప్స్‌గా వచ్చేవారు. చాలా మంది నన్ను బొంబాయి చూపించమనేవారు. ఆఫీసు మానేసి తెలుగువారిని బొంబాయి తిప్పేవాడిని. అలా కొన్నాళ్ళకి "గైడ్"గా అనుభవం వచ్చింది. మన మహాసభ ఎదురుగా ఉన్న "కింగ్ జార్జ్ హైస్కూల్" వారి బస్సులు ఉదయం 8.30 నుంచి రాత్రి 10 గంటల వరకు అద్దెకు తీసుకుని టూరిస్ట్‌లను తిప్పేవాడిని. లైఫ్ మెంబరుని అవటం వల్ల ఎంతోమంది నన్నే గైడ్‌గా రమ్మనేవారు. అర్ధరాత్రి టూరిస్ట్‌లు వచ్చేవారు. వారికి నేనే వసతి ఇచ్చేవాడిని. గైడ్‌గా బాగానే డబ్బు సంపాదించేవాడిని.

రాత్రి 10 గంటల తరువాత కూడా పేకాట సాగేది. ఆ డబ్బుతో నేను కూడా పేకాట ఆడే వాడిని. లాస్ట్ లోకల్ ట్రయిన్ కూడా వెళ్ళిపోయేది. అనేక సార్లు మహాసభలో పడుకున్న రోజులు ఉన్నాయి. మహాసభ అంటే మా సొంతఇల్లులాగే ఉండేది. కరెంట్ వాటర్ బిల్స్ కట్టడానికి కూడా ఫండ్స్ ఉండేవి కావు. మహాసభలో కొన్ని ప్రోగ్రామ్స్‌కి ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీకి వెళ్ళి మైక్ సెట్స్ పట్టుకొచ్చేవాడిని.

పదకొండు సంవత్సరాలు నావంతుగా కొంత మహాసభకి సర్వీస్ చేసి ఆ తరువాత ఉద్యోగ రీత్యా హైదరాబాద్ వచ్చేసాను. అటువంటి బొంబాయి ఆంధ్రమహాసభ & జింఖానా కొనలు సాగించి చిగురించి మహావృక్షం అయింది. కొమ్మలు వేరైనా, రెమ్మలు ఎన్నైనా వృక్షం ఒకటే... ఆ నీడలోనే ఉందాం ! తెలుగు భాష ఒకటి ! తెలుగు జాతి ఒకటే !జై తెలుగు తల్లి !!




# లక్ష్మీ జ్యువెలర్స్

# LAXMI JEWELLERS

2430 1744
9870377535

మా వద్ద తెలుగు వారి అన్ని రకముల వెండి,
బంగారు నగలు విశ్వాస పూర్వకముగా 916 హాల్ మార్క్
తయారు చేసి ఇవ్వబడును, తయారు నగలు దొరుకును.
90 సంవత్సరాల నుండి ప్రసిద్ధి పొందిన నమ్మకమైన
ఇల్లందుల వారి దుకాణం

Dealers in : 916 Hall Mark Gold, Silver & Fancy Ornaments





ప్రో. ఇల్లందుల సుదర్శన్





Advt.

షాప్ నం. 4, పటేల్ మెన్షన్, ఖేడ్‌గల్లి,
సయాని రోడ్, ముంబయి - 400 025

Shop No. 4, Patel Mansion, Khedgally,
Sayani Road, Mumbai - 400 025






**Dasharath B. Jindam**
9833030334

# ARCHANA
## G A R M E N T S

Specialist in 100% Pure Linen

Opp. Worli, B.D.D. Chawl No. 105
S.S. Amrutwar Marg, Mumbai - 400 013





తెలుగు భాందవులందరికి

# దీపావళి

శుభాకాంక్షలు

ఆపాత మధురం
(వ్యక్తిత్వం)
దర్పణం

# క్రమశిక్షణవాది

# జాన్ సర్



– జిల్లా గోవర్ధన్
9819096949

**ఆంధ్రా స్కూల్‌లో నేను 9 వ తరగతిలో చదివే రోజులు అవి.**

ఒక రోజు ఉదయం ప్రేయర్ బెల్ తర్వాత గాని స్కూలుకు చేరుకోలేదు. భయం భయంగా మెల్లగా అడుగులు వేస్తూ గేటు వద్దకు చేరుకుని చూశాను. 'హమ్మయ్య అతను లేరు..' గట్టిగా వూపిరి పీల్చుకుని గేటు దాటి లోపలికొచ్చాను.

ఎడమవైపు మెట్ల ప్రక్కనే నిల్చుని లక్షణంగా ఒక లుక్ వేసి "నమస్కారం మహాప్రభో ! రాజా వారికి ఈ రోజు ఇప్పుడే తెల్లవారినట్టుందే" అంటూ, ఓ అడుగు ముందుకేసి నా చెంప చెల్లుమనిపించారు ప్రిన్సిపల్ గారు.

"ప్రార్థన అయింది త్వరగా క్లాసుకెళ్ళి తగలడు" అంటూ మరో డైలాగ్ విసిరారు.

ఎప్పుడూ పీసెల్ సూటు, టై, డార్క్ పాలిష్ బూట్లు, నల్లటి శరీర ఛాయ, ముఖానికి ఆఫల్ స్నో, పాండ్స్ పౌడర్ దట్టంగా పట్టించి తన నల్లటి జుట్టును హిందీ సినిమాలోని ఆశోక్ కుమార్‌లా వెనక్కి దువ్వి, దర్పణంగా కనిపించేవారు. ఐదడుగులకన్నా తక్కువ ఎత్తు ఆయనది. గంభీరమైన ముఖవర్చస్సు, క్రమశిక్షణకు చండశాసనుడు. ఆయన కనిపిస్తే విద్యార్థులే కాదు అప్పటి టీచర్సుకు కూడ హడలే. చరిత్ర పుస్తకాల్లో హిట్లర్ గురించి చదివాము కాని ఎవరం చూల్లేదు కాని ప్రిన్సిపల్ జాన్ గారిని చూస్తే హిట్లర్ అచ్చం ఈయనలానే వుంటారని ఖచ్చితంగా చెప్పవచ్చు.

జాన్ సర్ హయాంలో డిసిప్లిన్ ప్రతి విద్యార్థి తు.చ. తప్పకుండా పాటించేవారు. ఫస్టు బెల్‌కు ముందే క్లాసు రూంల్లోకి చేరుకోవటం, స్కూలు అయిపోగానే సాయంత్రం క్యూ పద్ధతిలో ఒక క్లాసు విద్యార్థుల తర్వాత మరొకరు స్కూల్ బయట కెళ్లటం, లంచ్ టైం తర్వాత బెల్ మ్రోగగానే క్షణంలో అందరూ వారి సీట్లలోకి చేరుకోవటం తప్పని సరి. ఆ టైంలో స్కూల్ వరండాలో నిల్చుని బార్డర్ సెక్యూరిటీ ఆఫీసర్‌లా ప్రతి క్లాసు వైపు చూసేవారు. ఆ చూపే మా అందరికి "ఖత్రోంకి గంటీ" గా పని చేసేది. క్లాస్ పీరియడ్స్ జరిగేటప్పుడు వరండాలో మెల్లిమెల్లిగా అడుగులేస్తూ గమనించేవారు.

ఏమ్.ఎ.(లిటి.) ఎమ్.ఇడి. డిగ్రీ హోల్డర్ జాన్ మాస్టారు క్రమశిక్షణ పాఠాలు నా సక్సెస్‌ఫుల్ జీవితానికి పునాది రాళ్లలా పని చేశాయని చెప్పుకోవటంలో అతిశయోక్తి లేదు.

ఆయన ఆఫీస్ వర్కు చేస్తూ 10వ మరియు 11వ తరగతికి ఇంగ్లీషు పీరియడ్స్ తీసుకునేవారు. మాట్లాడేటప్పుడు మాత్రం తెలుగులోనే. తూర్పు గోదావరి యాసలో, ధారాళంగా, జలపాతంలా మాట్లాడేవారు.

ఓ రోజు....

క్లాసులో మా తులసి టీచర్ ఫిజిక్స్ పాఠం చెప్తోంది. ఎంత సేపట్నుంచి వరండాలో నిల్చుని కిటికీగుండా చూసారో తెలియదు కానీ హఠాత్తుగా క్లాసులోకి దూరి "అమ్మా తులసమ్మా..! తన్మయత్వంలో మీరు బాగానే పాఠం చెప్తూ వెళ్తున్నారు, మరి ఆ వెనుక బెంచి సన్నాసులు బుర్రల్లోకి వెళ్తోందా లేదా గమనించారా ?" అంటూ గబగబ అక్కడ కూర్చున్న

**మనవి:** ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రమహాసభతో ఎందరో సభ్యులకు ఎన్నో మధురానుభూతుల అనుబంధం పెనవేసుకొని ఉంది. అలాంటి అనుభూతుల్ని, అనుభవాల్ని మాకు రాసి పంపండి.. 'ఆపాతమధురం' శీర్షికలో ప్రచురిస్తాం.. ఆనాటి మీ సుమధుర జ్ఞాపకాలను మరోసారి నెమరువేసుకొండి.. అందరితో పంచుకొండి..!

సుకుమార్, వివేక్‌ల వైపు వెళ్ళి.... "ఎంట్రా ఆ పాచిపళ్లు బయటకేసి, ఎంటా వెకిలి నవ్వులు మీరూనూ ! ఆ జోకులేంటో నాకు కాస్త వినిపించి చావండి" అని ఆ ఇద్దరి వీపుల పై చెరో రెండు వాయించారు.

ఆ తర్వాత మేడం వైపు తిరిగి "పాఠాలు చెప్పేటప్పుడు, క్లాసురూంలో కాస్త డిసిప్లిను కూడా చూసుకోవాలి తల్లే" అని గాండ్రించినంత పని చేశారు. పాపం మేడంకు పిల్లల ముందు జరిగిన అవమానానికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి

మరో సారి...

తెలుగు పీరియడు పరీక్షిత్తు సర్ ఆ రోజు రాలేదు. మరేం ! ఖాళీ పీరియడ్ జిల్లోష్ పీరియడ్. సినిమా కబుర్లు పాటలు, కేరింతలు, క్యాట్ కాల్స్, వగైరాలతో అల్లరే అల్లరి మాది. ఆ అల్లరి విన్న జాన్ మాష్టారు గబగబ క్లాసులోకి రానేవచ్చి "ఎవడి బాపు పోయాడట్రా, లబోలబో మని అరుస్తున్నారు" అని గదమాయించారు.

అంతే ! పిన్‌డ్రాప్ నిశ్శబ్దం... 'ఎంటీ క్లాసా ఇది... చేపల బజారనుకుంటున్నార్రా వెధవల్లారా! ముందు బెంచిలో కూర్చున్న నా వైపు చూసి 'ఒరేయ్ గోవర్ధన్... ఏ పిరియడ్ ఇప్పుడు ?" ఆయన సడన్ ప్రశ్నకు, తీక్షణ చూపుకు తట్టుకోలేక, నేను తత్రుబాటుతో – "తె... తెలుగు పీరియడ్ సర్" అని చెప్పా. అలా గొణుగుతావేం..? ప్రొద్దున మీ అమ్మ గారు కూడెట్టకుండానే స్కూల్‌కి పంపిందా ఎంటీ ? గొంతు పెగలట్లేదు.. ఇందాక పోతే మరి రూం కప్పు కూలేలా గాడిద అరుపులు అరిచారుగా...ఇంతలోనే ఏవొచ్చిందీ.....? తెరవండి తెలుగు వాచకాలు" ఆర్డర్ పురమాయించారు.

'ఏ పాఠం నేర్పుతున్నారు మీ తెలుగు పంతులు గారు...? మరో ప్రశ్న.



'గజేంద్రుడు సర్" నా ప్రక్కన కూర్చున్న రాజేశ్వర్ జవాబు.

'గజేంద్రుడు సారేంటీ, రాజైతేను' అంటూ వ్యంగంగా ఓ నవ్వు నవ్వారు.

టెన్షన్‌లో వున్న మేమంతా ఆ జోక్‌కు కూడా నవ్వలేకపోయాం.

'ఓ..పోతనామాత్యుని 'గజేంద్ర మోక్షం'లోని పద్యాలా..?' అంటూ పుస్తకం తెరిచి, పోతన గురించి, ఆ కథలోని గజేంద్రుడు, శాపగ్రస్తుడయిన మొసలి గురించి వివరిస్తూ, ఆ పోట్లాటలో జవసత్వాలూడిన ఏనుగు, మహావిష్ణువునుద్దేశిస్తూ ప్రార్ధన విపలీకరించారు ప్రిన్సిపల్ గారు.

పుస్తకంలోని 'ఎవ్వనిచో జనించు, జగమెవ్వరి లోపల...' 'లావొక్కింతయు లేదు...' 'సిరికింజెప్పడు, శంఖచక్రమను చేదోయి సందింపడా....' పద్యాల తాత్పర్యం చెప్తూ మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అంతలోనేపీరియడ్ అయిపోయినట్లు బెల్ మ్రోగింది. పుస్తకం మూసేస్తూ.. 'పీరియడ్ పేరుతో ఇందులోని నాల్గు పద్యాలు కంఠస్థం పెట్టుకుని రేపు రావాలి.. చెప్పక పోయారో మరి తోలు వలిచేస్తాను... జాగ్రత్త..' అని వెళ్లారు.

ఆయన పుణ్యమా అని ఆ పద్యాలు ఇప్పటికి నాకు జ్ఞాపకమే ! (ఆశ్చర్యం కదూ ?)

నేన పదవ తరగతికి వచ్చేసరికి జాన్ సర్ ట్రాన్స్‌ఫర్ అయి, ఆ సీట్లో శ్రీమతి లలితాశర్మగారు కూర్చున్నారు(1970 లో). మాస్టారు వీడ్కోలు సత్కార సభకు ఉపాధ్యాయ బృందంతో పాటు, 9,10,11వ తరగతి విద్యార్థులు కూడ హాజరయ్యారు (ఆఫ్‌కోర్సు... నేనూను..). ఆ సందర్భంగా ఆయన టీచింగ్ స్పీచ్ నా మనోఫలకం పై చెరగని ముద్ర వేసింది..

ఆయన మాట్లాడుతూ...

'మా తూర్పు గోదావరి స్కూల్ నుండి ఈ స్కూల్‌కి ఎంత సడన్‌గా వచ్చానో, అంతే సడన్‌గా వెళ్తున్నాను. వచ్చానని అప్పుడు సంతోషం లేదు, వెళ్లాల్సి వస్తున్నందుకు బెంగనూ లేదు, ఎంచేతంటే అక్కడ నేను పిల్లలకి పాఠాలు చెప్పేవాడిని, ఇక్కడనూ అదే పని. పాఠాల కన్నా ముఖ్యం నేను క్రమశిక్షణకే ప్రాముఖ్యత ఇస్తుంటాను. ఈ పాటికి ఇది మీ అందరికి తెలిసే ఉండాలి. జీవితంలో క్రమశిక్షణ పాటించే ప్రతి వ్యక్తి ప్రగతి బాటను సునాయసంగా దాటగల్గుతాడు, ఎలా అంటారా ?'


ఓ క్షణం ఆగి,


'ఈ బొంబాయి మన పట్టణంకాదు. ఈ ఊళ్లో ఉద్యోగాలకు కొదవలేదు. ఇక్కడ మనం అంతా పరాయి వాళ్లం. అంచేత, ఇక్కడి వాళ్లకన్నా, మనం తెలివిగా, చుఱుగ్గా, రీతిగా

మసులుకుంటేనే బ్రతుకు తెరువులు, ఉన్నత ఉద్యోగాలు చేజిక్కించుకుంటారు, కాదంటారో....? ఇక్కడి వాళ్ల మూటలు మోస్తూ బ్రతుకాల్సివస్తుంది. నా విద్యార్థులు అలా బ్రతకడం చూస్తే, ఇంతకన్నా అవమానం లేదు...

నేను నేర్పిన డిసిప్లిన్ నచ్చక మీలో కొంతమంది, మరోకొందరు టీచర్సు నన్ను రాజనాల వారిగా (పాత తెలుగు సినిమా విలను) చిత్రించారు. బాధలేదు... నా విద్యార్థులు ప్రయోజకులుగా రాణించటానికి, మొదట ఎక్కవలసిన ప్రగతి మెట్టు క్రమశిక్షణతోనే సాధ్యం. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. అదే నేను మీకు నూరి పోశాను. అది మరి తప్పో లేక ఒప్పో కాలమే ఋజువుపరుస్తుంది. తర్వాత సెలవు తీసుకుంటూ 'నేను మంచి వాణ్ణి అని అనుకుంటే ఏడాదికి ఒకరోజు... అదే టీచర్స్‌డే (5 సెప్టెంబరు) నాడు గుర్తుకు తెచ్చుకొండి. ఇక చెడ్డ వాడ్ని అనుకుంటే రేపే మరచిపొండి...' అంటూ తన సీటులో కూర్చున్నారు జాన్ మాష్టారు . అప్పుడు చూసాం మొట్ట మొదటిసారి ఆయన రోల్డ్‌గోల్డు కళ్లజోడు వెనుక అశ్రువులు దొర్లుతున్నకళ్ళు....!

మరి మీరు నమ్ముతారో లేదో ప్రతి టీచర్స్ డే రోజు ఠంచనుగా నా కళ్ళముందు ఒక్క సారయిన కనిపించే రూపం మా ప్రిన్సిపల్ జాన్ సర్...గొప్ప క్రమశిక్షణవాది.. ఆయన నేర్పిన ఆ ఉపదేశమే, నా భావి జీవిత సాఫల్యానికి తెరచాపలా దోహద పడింది. ఇది నిజం...!






# ఆలాపన

– సమంజలి

సాహితీ దర్పణం

చిన్ని చిన్ని నవ్వులతో
తుళ్ళి పడే అడుగులతో
వేల వేల కాంతుల్ని
వేద జల్లే పసి వయసు
వెల వెల బోతుంది చూడు
అమ్మ నాన్న తోడు లేక.

అమ్మ నాన్న పిలుపులకు
నోచుకోని అనాథలం
"ఆయా" అనే పిలుపే
దేవుడు మా కిచ్చిన వరం

అమ్మ, నాన్న, అక్క చెల్లె
అనుబంధం మాకు లేదు
బంధుత్వపు వరుస లేదు
రాబంధుల విమర్శ చూడు

ఏ కలియుగ కుంతి
కన్న బిడ్డలమే మేము
సంఘంలో విలువ లేదు
సాటి మనిషి ప్రేమ లేదు

గుప్పెడంత గుండెలోన
ఆలోచన కెరటాలు
ఎగసి ఎగసి పడుతుంటే
ఓదార్చే తోడు లేదు



ఎన్నాళ్ళీ ఎదకోత
ఎన్నాళ్ళీ ఎదురీత
మారండి మనుషులారా !!
మార్చండి మా తలరాత

❀❀❀


A.V. NAGESWARA RAO
PRO - Shriram Chits (M) Ltd.
anr28@rediffmail.com
Mob.: 9029434560 / 9833434572
మీ విశ్వసనీయమైన ఆర్థిక
నేస్తం-నేటికీ, ఏనాటికీ!
శ్రీరామ్ చిట్స్
శ్రీరామ్ చిట్స్ (మహారాష్ట్ర) లిమిటెడ్,
418-419,బెజోలా కాంప్లెక్స్ సుమన్ నగర్ ఎదురుగా,
సియోన్-ట్రాంబే రోడ్, చెంబూర్ ఈస్ట్, ముంబయి-71.
ఫోన్ : +91 22 42680800-99
Shriram Chits
Empowering People Through Prosperity
• Chit Funds
• Deposits
• Life Insurance
• General Insurance
• Personal Loans
• S.M.E. Loans
• Loans Against property
• Gold Loan
• Loan For Gold Purchase
Shriram Chits (Maharashtra) Ltd.,
418-419, Bezzola Complex,Opp. Suman Nagar,
Sion-Trombay Road,Chembur (E), Mumbai - 400 071
Tel.: 42680800 - 99 Fax: 42680822
Advt.

## మీకు తెలుసు కదా..!

**మ**హాసభ అంటే కేవలం మనోరంజక కార్యక్రమాలు, కాలక్షేపాలే కావనీ, తెలుగు సాహితీ సంస్కృతులు పరిరక్షణ కేంద్రమనీ, తెలుగు ఐక్యతకు ప్రతీక అని **మీకు తెలుసు కదా..!** అంతేకాదండీ..! ఇంకా ఉన్నాయి..

### మీ భక్తి ప్రవృత్తుల కోసం..



**మ**హాసభ ప్రాంగంణంలోనే శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఉంది. నిత్యపూజలతో కళకళలాడే ఆ స్వామివారిని దర్శించుకుంటే ఏ ఆపదలు రావనీ, ఆపదమొక్కుల వాడి ఆశీస్సులు అందరికీ అందుతాయనీ **మీకు తెలుసు కదా..!** అయితే ఇంకేం..? రండి..! సకుటుంబ సపరివారంగా మహాసభలో కొలువై ఉన్న ఏడుకొండలవాడిని దర్శించుకుని పాపపరిహారం పొందడమే కాకుండా మోక్షమార్గాన్ని సులభతరం చేసుకొండి..!

### మీ ఆరోగ్యం కోసం..



**'ఆరోగ్యమే మహాభాగ్యం'** అన్నారు పెద్దలు..మరి ఆరోగ్యం బాగుండాలంటే దేహం చురుకుగా ఉండాలి. దేహం చురుకుగా ఉంగాలంటే ప్రతి అవయవం వేగంగా కదలాలి. అందుకే ఆంధ్రమహాసభలో స్కేటింగ్‌ను ప్రవేశపెడుతున్నాం. అయితే ఇందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మహాసభ జీవిత సభ్యులకు ఈ ఫీజు ప్రతి వ్యక్తి రూ॥లు 350/–, జీవిత సభ్యులు కాని వారికి రూ॥ 850/– ప్రతి నెల చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి బుధ, శుక్రవారం నాడు సాయంత్రం 5 గం॥ నుండి 8 గం॥ వరకు స్కేటింగ్‌లో శిక్షణ ఇవ్వబడుతుంది. ఇవన్నీ **మీకు తెలుసు కదా..!**

### మీ విజ్ఞానం కోసం..



**పుస్తకం హస్త భూషణం** అన్నారు కదండీ..! అంతేకాదు.. పుస్తకాలు లేని ఇల్లు స్మశానంతో సమానమని కూడా అన్నారు. పుస్తకం మనిషి మస్తిష్కానికి ఎరువులాంటిది. అలాంటి విజ్ఞానజ్యోతుల్ని వెలిగించి పెంచే దాదాపు 8 వేల అమూల్యమైన గ్రంథాలెన్నో ఆంధ్రమహాసభలోని శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గ్రంథాలయంలో మీ కోసం ఎదురుచూస్తున్నాయనీ **మీకు తెలుసు కదా..!**

### మీ సంస్కృతి కోసం..



**క**ళలు మన సంస్కృతికి తాళపు చెవులు. కళలు ఒక జాతికి ధృవీకరణ పత్రాలు. నాట్యం, గానం, సంగీతం, సాహిత్యం అన్నీ కూడా మనిషిలోని చీకటి తెరల్ని తొలగించి, వెలుగు కిరణాలకు స్వాగతం పలికే దీపదారులు. మహాసభలో వివిధ నాట్య రీతుల్ని నేర్పించే తరగతులు నిర్వహిస్తున్న విషయం **మీకు తెలుసు కదా..!**

వీటితోపాటు ప్రతి నెలా విజ్ఞానపరం, వినోద, ధార్మిక కార్యక్రమాలు, ఆరోగ్యశిబిరాలు, కౌన్సిలింగ్ ప్రోగ్రాములు రెగ్యులర్‌గా జరుగుతాయి. దర్పణంలో కార్యక్రమాల వివరాలు తెలుసుకొండి.. రండి..! ఆంధ్రమహాసభ మనది.. మనందరిది..! కార్యక్రమాల్ని విజయవంతం చేద్దాం..! మన స్వాభిమానాన్ని పెంచుకొందాం..!! ఇది

**మీకు తెలుసు కదా...!!**

## సభ్యులకు సవినయ విన్నపం

ఆంధ్రమహాసభ మహారాష్ట్ర తెలుగువారందరికీ ఆరాధనాకేంద్రంగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే.. అంతేగాక, తెలుగు సంస్థలన్నింటికీ మాతృసంస్థగా పేరుపొందింది కూడా.. అందుకే మహాసభలో జరిగే కార్యక్రమాల గురించి కానీ, కార్యకలాపాల గురించి కానీ సభ్యులైనవారు, సభ్యులుకానీ వారు కూడా ఎంతో ఆసక్తిగా చర్చించుకుంటారు. మహాసభ తెలుగువారి మానసపుత్రిక కావున ప్రతివారికి ఈ మహాసభ పట్ల ఎంతో గౌరవాభిమానాలు ఉన్నాయి.

అయితే మహాసభ గురించి ఎవరు, ఎక్కడ మాట్లాడినా, చర్చించినా మహాసభ గౌరవప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్త పడాల్సిన కర్తవ్యం అందరిపైన ఉంది.

**మా మనవి ఏమనగా...**

మహాసభ గురించి ఎవరైన సలహాలు, సూచనలు ఇవ్వాలనుకున్నా, మహాసభ గురించి అభిప్రాయాలు వెల్లడించాలనుకున్నా దయచేసి ప్రధాన కార్యదర్శి పేరు మీద నేరుగా మహాసభ కార్యాలయానికే రాతపూర్వకంగా ఇవ్వాలనీ, వీధుల్లో, చౌరస్తాల్లో మహాసభ గురించి అనవసరమైన అధిక ప్రసంగం చేయడం భావ్యం కాదని విన్నవించుకుంటున్నాం.

అంతేగాకుండా, సోషల్‌మీడియాల్లో అంటే వాట్సప్‌లో కానీ, మెయిల్స్‌లో కానీ, ఫేస్‌బుక్‌లాంటివాటిలో కానీ మహాసభ గురించి విమర్శనాత్మకమైన చర్చలు చేయొద్దనీ, దీనివల్ల మనందరికి ప్రియమైన మహాసభను కించపరిచినట్లవుతుందని తెలియచేస్తున్నాం. మీరు రాతపూర్వకంగా ఇచ్చిన వాటిపై మేం కమిటీ మీటింగ్‌లో చర్చించి అవసరమనిపిస్తే మేం తీసుకోబోయే చర్యల గురించి రాతపూర్వకంగానే తెలియచేస్తాం. ఇది అందరికీ గౌరవంగా ఉంటుందని మరొక్కసారి మనవి చేస్తున్నాం.

మహాసభలో ఎన్నో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అందుకోసం అధికారికంగా మేం ప్రయత్నిస్తాం. మీ సలహాలు, అభిప్రాయాలు మాకు ఎంతో అమూల్యం. వాటిని బహిరంగంగా చర్చించి సొంతకీర్తికోసమో, చవక ప్రచారం కోసమో వినియోగించకుండా నేరుగా మహాసభనే సంప్రదించాలనీ కోరుతూ..

మా మనవిని మన్నించి సభ ప్రతిష్టను పెంచేందుకు సహకరిస్తారనీ ఆశిస్తున్నాం.

**సంకు సుధాకర్,**
అధ్యక్షులు

**యాపురం వేంకటేశ్వర్**
ప్రధాన కార్యదర్శి

మహాసభ ముఖపత్రిక దర్పణంను ప్రతినెలా మీకు రెగ్యు లర్‌గా అందించేందుకు మేం కట్టుబడి ఉన్నాం. సమచారంతో పాటు విలువైన సాహిత్యాన్ని అందించే విధంగా దాన్ని తీర్చిదిద్దుతున్నాం. అయితే ఇది చాలా ఖరీదైన వ్యవహారం గనక, మీరు, మీ పరిచయ స్తులు దర్పణం కోసం ప్రకటనలు ఇవ్వాలనీ మనవి చేస్తున్నాం.

దీంతో మీకు తగిన గుర్తింపు లభించడమే కాకుండా, మహాసభకు మీ వంతు సేవలందించిన వారవుతారు. అంతేగాక, ప్రకటనల్ని ఇప్పించిన వారికి దర్పణంలో రాతపూర్వకంగా కృతజ్ఞతలు కూడా తెలుపుతామని మనవి చేస్తున్నాం.

## సభ్యులకు మనవి

- మీ చిరునామాగానీ, ఫోన్ నంబర్‌గానీ మారితే వెంటనే మాకు రాసి పంపండి.
- దర్పణంలో ప్రచురణార్థం కవితలు, జోక్స్, వింతలు విశేషాలు, చిన్న చిన్న కథలు, వ్యాసాలు రాసి పంపండి. ప్రచురణకు అర్హమైన వాటిని అవసరం వస్తే చిన్నచిన్న మార్పులు చేసి ప్రచురిస్తాం.
- సభ్యులు ఏదైనా సామాజిక, సాంస్కృతిక, సాహితీ, క్రీడా, విద్యా లాంటి రంగాల్లో ఏదైన అవార్డులు, రివార్డులు పొందినట్లయతే మాకు తెలపండి. వీలైతే అందుకు సంబంధించిన ఫోటో కూడా పంపండి. ప్రచురిస్తాం.
- రచనలు తమ స్వంతమనీ హామీ పత్రం జతచేయండి.
- ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. వాదోపవాదాలకు తావులేదు.
- పెళ్ళి రోజులు, పుట్టిన రోజుల గురించి ముందుగా తెలపండి..ఉచితంగా ప్రచురిస్తాం.
- సభ్యులకు చెందిన సంతాప వార్తలు కూడా ప్రచురిస్తాం.

***ఈ దర్పణం ఆంధ్రమహాసభ సభ్యుల మనోదర్పణానికి దర్పణం కావాలన్నదే మా ఆశయం.***

# ఆకలివాదం

- సంగెవేని రవీంద్ర
సెల్: 099871 45310

ఆకల్ని వర్ణించాలో కీర్తించాలో
తెలియని అయోమయం...
అరున్నర దశాబ్దాల స్వేచ్ఛాభారతిలో
ఆరిపోని రావణకాష్టం ఆకలొక్కటే...
పార్లమెంట్ సాక్షిగా
ఆత్మల్లేని దేహాలు ఆస్తుల్ని
ప్రకటిస్తున్న వేళ...
ఆకలి ఎడారుల్లో వేల వేల పసిగొంతులు
బ్రహ్మజెముల్లై మొలకెత్తుతుంటాయి...

పెదాల చిరునవ్వులపై
వాడు అతికించుకున్న
ఖడ్గనినాదాలు ఆకలి గొంతుల్ని
మత్తులో ముంచుతుంటాయి...
రంగుతెరల అభివృద్ధి అద్దంలో
వాడు ఆకల్ని జోకొడుతుంటాడు...

పేగులు పీక్కుపోయి నరాలు మెలికలు పడి
హుద్‌హుద్‌లా ఎగిసిపడే
ఆకలి ఆక్రందనలకు వాడు చేసే ప్రథమ
చికిత్స
హవాయి పర్యవేక్షణొక్కటే...

ప్రగతిరథం పేరుతో ఆదివాసీల
అడుగు నేలని కార్పోరేట్లకు
కానుకగా ఇచ్చినప్పుడు
ఆకలి అగ్గి మరింత రాజుకుంటుంది..
నిత్యజ్వలనంలో నిరుపేదల ఆకలి
మరింత నిగ్గదీసి రగులుకుంటుంది...

వాగుల్ని వంకల్ని అడవుల్ని గనుల్ని
ఆవురావురంటూ మింగేస్తున్న వాడికి
ఆకలి రహస్యం ఎప్పటికీ అర్థం కాదు...
వాడు స్వప్నించే క్లీన్ఇండియా చీపురుపుల్లలకు
ఆకల్ని ఊడ్చేసే తపనా లేదు...తంతూ లేదు...


చితిమంటల్లో చిగురేసే పచ్చటి ఆకలి
జనంలోకి ప్రవహించడాన్ని ఆపే
ప్రణాళికలేవీ వాడి వద్ద ఉండవు...

వాడి చూపంతా పైపైకే..
పునాదుల్లో గిలగిల కొట్టుకుంటున్న ఆకలి నగ్నత్వం
వాడికి కనిపించదు...
ఆర్భాటాలు అధికప్రసంగాలు తప్ప
వాడికి అకలంటే తెలియదు...

బహుశ...
వాడికి ఆయుధమంటే కూడా తెలియదు..

ఆకలి ఆయుధంగా రూపాంతరం
చెందే పరిణామక్రమం వాడి
హైటెక్కు చూపులకు అందదు...
ఆకలి పరిపూర్ణ ఆయుధంగా మారిన నాడు
వాడికి రేపంటూ మిగలదు..!!


❋❋❋



# ఉద్యమమే ఆయన ఊపిరి

# కొండా లక్ష్మణ్ బాపూజీ

**వయసు పెరిగిన కొద్దీ యువకుడిలా కనిపిస్తూ రాజ్యాంగంలోని నైతిక సిద్ధాంతాలను, విలువలను పోషించి సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన దేశభక్తుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. ఆయన జీవిత కాలమంతా పోరాటాలతోనే గడిచిపోయింది. ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలతో పాటు అనేక వృత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన ఉద్యమ జీవి.**



దళిత, బహుజన వర్గాలను ఏకం చేసి వారి హక్కుల సాధనకు, రాజకీయ అధికార సాధనకు మార్గం సుగమం చేయాలని నిరంతరం పాటుపడిన తపస్వి... రాజీ ఎరుగని యోధుడు. ఆయనది మొదట నుంచి తిరుగుబాటుతత్వం.

అదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలూకా వాంకెడ్‌లో 1915 సెప్టెంబర్ 15న కొండా లక్ష్మణ్ జన్మించారు. ఆసిఫాబాద్‌లో మిడిల్ పాసయ్యారు. 1930లో విద్యార్థి దశలో ఉండగా స్కూలు నిబంధనలు లెక్కచేయకుండా చాందా కొచ్చిన మహాత్మా గాంధీని దర్శించుకున్నారు. నాటి నుంచి గాంధీ టోపీ ధరించడం ప్రారంభించారు.

ఆ రోజుల్లో నిజాం రాష్ట్రంలో ఖాదీ దుస్తులు ధరించడమంటే నేరమే. ఎంతో ధైర్యం ఉన్నవారే ఆ పని చేసేవారు. కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఆయన హైదరాబాద్‌లో వకాలత్ చదువు పూర్తి చేశారు. వకాలత్ వృత్తి చేసే రోజులలో నాటి సర్కారు నిబంధన ప్రకారం షేర్వాణీ ధరించలేదు. దస్తార్ పెట్టుకోలేదు. రాజకీయ కేసులు నడపటంలో దిట్ట అని పేరు తెచ్చుకున్నారు.

హైదరాబాద్‌కు రాగానే కొండా లక్ష్మణ్ వివిధ ప్రజా సంఘాలతో మమేకమయ్యారు. మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతం నుండి వచ్చినందుకు లక్ష్మణ్‌లో ఆర్య సమాజ్ సిద్ధాంతాలతో ఒక వైపు, మరోవైపు ఆంధ్రమహాసభ సంస్కరణలతో సహజీవనం గడపవలసివచ్చింది. ఆంధ్రమహాసభ అభ్యుదయ పక్షంలో ఆయన పనిచేశారు. నిజాం ప్రభుత్వ నిర్బంధాలకు గురైన సమరయోధుల కేసులను ఆయన వాదించేవారు. లక్ష్మణ్ కేసు చేపట్టాడంటే పోలీసులు జాగ్రత్త పడేవారు.


న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న రోజులలో లక్ష్మణ్‌కు పద్మశాలియువజన సంఘాలతో సంబంధం ఏర్పడింది. ఆ రోజులలో పద్మశాలి వంటి వెనుకబడిన కులాల వారి పరిస్థితులు కడుదయనీయంగా ఉండేవి. వారిని అధికారులు ఎన్నో ఇబ్బందులు పెట్టేవారు.

వతన్‌దార్లు, జమీందార్లు, పర్యటనకు వచ్చే అధికారులు వారి చేత వెట్టి చాకిరీ చేయించుకునేవారు. లక్ష్మణ్ కొంతమంది కార్యకర్తలను తయారు చేసుకొని సైకిళ్ళ మీద ఊరూరా తిరిగి పద్మశాలి కుల సంఘాలు స్థాపించి, వారిని జాగృత పరచేవారు.

1944లో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో జరిగిన పద్మశాలి కష్ట నివారణ సంఘానికి అధ్యక్షత వహించారు. 1945 –46లో నిజాం రాష్ట్ర పద్మశాలి మహాసభకు అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. చేనేత పారిశ్రామిక విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించడానికి వీలుగా పద్మశాలి హాస్టల్ నిర్మించారు . దీనితో గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు సులభంగా వసతి సౌకర్యాలు లభించాయి.

స్వాతంత్ర్య పోరాటంలో స్టేటు కాంగ్రెస్‌లో ఆయన స్వామి రామానందతీర్థ నాయకత్వంలో పనిచేశారు. నిజాం అవసరం లేని పూర్తి స్వాతంత్ర్యం కావాలనే దీక్షతో ఆయన ఉద్యమాలు నడిపారు. 1938లో పుత్లీ బవులీ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్ట్ అయ్యారు. వందేమాతరం ఉద్యమంలో కూడా ప్రధాన పాత్ర వహించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం జరిగింది. సత్యాగ్రహంలో పాల్గొనే వాలంటీర్లను సమీకరించడం, వారిచేత ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించి నిజాం ప్రభుత్వం వెన్నులో చలిపుట్టించే కార్యక్రమాలు నిర్వహించారు.

భారత ప్రభుత్వ తంతి, తపాలా కార్యాలయ భవనంపైన (సుల్తాన్‌బజార్), రెసిడెన్సీ భవనం పైన కాంగ్రెస్ పతాకం ఎగురవేసిన సాహసి. ఈ చర్యలతో ఆయన ప్రభుత్వ దృష్టిలో ప్రమాదకరమైన వ్యక్తిగా నమోదు అయ్యారు.



ఇక్కడ ఉంటే తనపై ప్రభుత్వ నిఘా ఎక్కువవుతుందని బావించిన కొండా లక్ష్మణ్ పఠాన్ వేషంలో హైదరాబాద్ నుంచి రహస్యంగా బొంబాయి చేరుకుని, షోలాపూర్‌లో నిజాం విముక్తికోసం సాయుధ పోరాట క్యాంపు నిర్వహించారు. నిజాం పై బాంబు విసిరేసిన కేసులో నారాయణరావ్ పవార్‌తో పాటు ఆయన కూడా నిందితుడే.

మొదటి శాసనసభ ఎన్నికల్లో కొండా లక్ష్మణ్ హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు ఆసిఫాబాద్ నియోజక వర్గం నుంచి ఎన్నికయ్యారు. విశాల ప్రాతిపదికపై మంత్రివర్గ నిర్మాణం జరిగితే తప్పక ఆయనకు మంత్రి పదవి లభించేది. కానీ మంత్రివర్గ సభ్యుల పై పరిమితి రావడంతో ఆయనకు ఆ అవకాశం తప్పిపోయినది. వస్తుందనుకున్న స్పీకరు పదవి రాలేదు. ప్రాంతీయ కోటలో ఆ పదవి మరాఠ్వాడాకు చెందిన నాయకునికి కేటాయించారు. అయితే నేం ? కొండా లక్ష్మణ్ ఆ రోజులలో ప్రముఖ శాసన సభ్యుడుగా ఉండేవారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఇబ్బందులకు గురైన మంత్రులకు చేదోడుగా ఉంటూ సమయోచిత సమాధానాలందిస్తూ ప్రతిపక్షాల చేత ‘పదమూడవ మంత్రి’ అనిపించుకున్నారు.


ఆంధ్రప్రదేశ్ శాసన సభకు మొదటి డిప్యూటీ స్పీకరుగా పనిచేశారు. ఆయన నాలుగు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. సంజీవయ్య, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గాలలో మంత్రిగా పనిచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సమయంలో ఆయన ‘తెలంగాణ కాంగ్రెస్’ అనే ఒక ఉప సంస్థ పెట్టుకున్నా ఇందిరా గాంధీకి విధేయులుగా ఉండేవారు. ఒక సందర్భంలో ముఖ్యమంత్రి పదవి రేసులో కొండా లక్ష్మణ్ పేరు కూడా వినిపించింది. కానీ అదృష్టం అందరికీ ఒకేలా ఉండదు.

కొండా లక్ష్మణ్ రాష్ట్రంలోని ఎన్నో సామాజిక ఉద్యమాలను నాయకత్వం వహించారు. హైదరాబాద్ కేంద్ర సహకార సంఘానికి అధ్యక్షులుగా పలుమార్లు ఎన్నికయ్యారు. ఈ రంగంలో అత్యున్నతమైన ‘సహకార రత్న’ అనే బిరుదుతో ఆయనను గౌరవించారు. దేశ సేవకు అంకితమైన కుటుంబం ఆయనది. ఆయన భార్య డా॥ శకుంతలాదేవి చైనా యుద్ధ సమయంలో క్షతగాత్రులైన సైనికులకు వైద్య సేవలందించి, ‘మేజర్’ పదవితో గౌరవం పొందారు. ఆయన కుమారుడు భారత సైన్యంలో ఎయిర్ ఫోర్స్ విభాగంలో పనిచేస్తూ యుద్ధరంగంలో వీరమరణం పొందారు.

97 సంవత్సరాల వయస్సులో కూడా వృద్ధాప్యం దరికి రానీయకుండా దేశసేవలో నిమగ్నుడైన కొండా లక్ష్మణ్ 2012 సెప్టెంబర్ 21న అనాయాస మరణం పొందారు.

# కాలాతీత చిత్రకారుడు

# కాపు రాజయ్య



**జీవితాన్ని గెలిచేందుకు వనరులు, వసతులు ముఖ్యం కాదు.. పట్టుదల, పరిశ్రమ, చిత్తశుద్ధి ఉంటే తాను మెచ్చిన రంగంలో తనను మించినవారు లేని విధంగా జీవితాన్ని మలుచుకోవచ్చుని నిరూపించిన అరుదైన వ్యక్తి, ఆద్భుత చిత్రకారుడు కాపు రాజయ్య.**



చిన్నప్పుడు పెన్సిల్లు కొనుక్కునేందుకు పైసల్లేవు.. చదువుకునేందుకు ఆర్థిక అడ్డంకులెన్నో... ఆదరణ కూడా అంతంత మాత్రమే.. అయినా ఏ మాత్రం ధైర్యాన్ని విడనాడలేదు. తనకు నచ్చిన, తాను మెచ్చిన రంగంలో అత్యున్నత స్థానాన్ని చేరుకోవాలనుకున్నాడు. వ్యతిరేక పరిస్థితుల్ని లెక్కచేయకుండా నిరంతరం కత్తిమీద సాము చేస్తూ ప్రపంచ ప్రఖ్యాతి పొందిన చిత్రకారుడిగా చరిత్ర పుటల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. కాపు రాజయ్య జీవితాన్ని చదివితే ఏ వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవాల్సిన అవసరం లేదు..

+++

మెదక్ జిల్లా, సిద్ధిపేటలో వ్యవసాయ వృత్తికి (మున్నూరుకాపు) చెందిన భూలక్ష్మి, రాఘవులు దంపతులకు ఎప్రిల్ 7, 1925 నాడు జన్మించాడు రాజయ్య. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. చదువు సంధ్యలు అంతంత మాత్రమే. రాజయ్యకు మొదట్నుండి ప్రాకృతిక సహజ సౌందర్యాల పట్ల మక్కువ ఎక్కువ. ప్రకృతి దృశ్యాలను, వృత్తి కళాకారులను సునిశితంగా పరిశీలించేవాడు. ఆ వీధి వీధంతా వృత్తికళాకారుల కుటుంబాలే ఉండేవి.

అదే వీధిలో ఉండే ఓ మార్వాడి ఇంటిలో ఉన్న నకాషీలు రాజయ్యను విపరీతంగా ఆకర్షించేవి. వాటిని ఎంతో శ్రద్ధగా గమనించేవాడు. ఆ ఆసక్తే రాజయ్యను చిత్రకళ వైపు నడిపించింది. రాజయ్యలో దాగివున్న చిత్రకారుడ్ని స్కూల్ టీచర్ పసిగట్టాడు. ఎందుకో తెలియదు కానీ ఈ పిల్లాడు తప్పకుండా ప్రపంచ ప్రఖ్యాతి పొందే చిత్రకారుడు అవుతాడని విశ్వసించేవాడు. అందుకే రాజయ్యను ఎంతో ప్రోత్సహించేవాడు.

సొంత ఆసక్తి, టీచర్ ప్రోత్సాహం రాజయ్యను హైదరాబాద్‌లోని ప్రభుత్వ చిత్రకళా పాఠశాలకు చేర్చింది. అక్కడ చిత్రకళలో డిప్లోమా సాధించాడు. చెప్పుకున్నంత సులువుగా జరగలేదు. కనీసం పెన్సిల్లు కొనుక్కునేందుకు కూడా డబ్బులు ఉండేవి కావు. గంటకు ఇంత చొప్పున అని సీనియర్ల వద్ద పనిచేసేవాడు. వాళ్ళిచ్చిన డబ్బుతో పెన్సిల్స్ కొనుక్కునేవాడు.



చిత్రకళ ఒక్కటే తన జీవితంగా భావించిన రాజయ్య చిత్రకళకే తన జీవితాన్ని అంకితం చేశాడు.

1946లో డ్రాయింగ్ టీచర్‌గా సిద్ధిపేటలోనే ఉద్యోగంలో చేరాడు. దాంతో కొంత ఆలంబన దొరికింది. చిత్రకళలో తన తపస్సును కొనసాగించాడు. రాజయ్య చిత్రాల్లో జానపద ఆత్మ కొట్టొచ్చినట్టు కనపడుతుంది. మొదట్నుండి చివరి వరకు తన శైలి మారకుండా జాగ్రత్త పడ్డాడు. రాజయ్య అంటే సప్త వర్ణాల సంగమంగా పేరుపొందాడు.

చిన్నప్పట్నుండి తాను చూసిన తెలంగాణ బతుకు వ్యథల్ని, కన్నీళ్ళను ఆధారంగా చేసుకొని ఆయన చిత్రాల్ని రూపొందించేవాడు. తెలంగాణ పట్టుకొమ్మలైన గ్రామీణ వాతావరణం ఆయన చిత్రాలకు ప్రాణవాయువు. ఆయన సృష్టించిన కళాఖండాల చర్చ క్రమంగా ఊపందుకోసాగింది.

1951లో ఆంధ్రప్రభలో ఆయన చిత్రాలు అచ్చయ్యాయి. దాంతో ఆయన పేరు ఆంధ్రప్రదేశ్ అంతా మారుమ్రోగింది. రాజయ్యది చిత్రకళలో ఒక విశిష్టమైన శైలి. నఖాషీ ప్రక్రియలో రాజయ్య ఉన్నత శిఖరాల్ని చేరుకున్నాడు. తాను రూపొందించిన పౌరాణిక చిత్రాల్లో కూడా జానపది శైలి దోబూచులాడుతుంది. గ్రామీణ వాతావరణం రాజయ్య చిత్రాల్లో అనివార్యంగా కనిపిస్తుంది.

ఒక స్టూడియో పత్రిక కోసం వేసిన ముఖచిత్రం రాజయ్యకు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆయన చిత్రాల్ని వివిధ దేశాలకు చెందిన కళాపిపాసులు అభిమానించ సాగారు.

వృత్తి కళాకారుల వీధిలో బాల్యం గడిచినందుకు కాబోలు రాజయ్య చిత్రాలు ఎక్కువగా వృత్తి కళాకారుల జీవితాల ఆధారంగానే ఉండేవి. ఆయన చిత్రించిన వద్దెర మహిళ, జోగి ఎల్లమ్మ, గోపికాకృష్ణ, పంట పొలాలు, వసంత ఖేళీ, కోలాటం, గౌడులు, బోనాలు, బతుకమ్మ తదితర చిత్రాలు అంతర్జాతీయ కీర్తి పొందాయి.

సాంప్రదాయ పద్ధతితో పాటు, అబ్‌స్ట్రాక్ట్ చిత్రాల్లో కూడా రాజయ్య ఒక విప్లవాత్మక మార్పును ఆవిష్కరించారు. ఎల్లలు దాటిన తొలి తెలంగాణ చిత్రకారుడిగా రాజయ్య ప్రఖ్యాతి గాంచాడు.

1963లో సిద్ధిపేటలో లలిత కళాసమితిని స్థాపించాడు. దానిద్వారా వందలాది విద్యార్థులకు చిత్రకళను నేర్పించాడు. జానపద, గ్రామీణ చిత్రరీతుల్ని అద్భుతంగా మేళవించి ఒక సరికొత్త ప్రక్రియకు ఆద్యుడిగా నిలిచిపోయాడు. రిస్కీ లైఫ్ పేరుతో గీత కార్మికుల జీవితాల్ని రాజయ్య చిత్రించిన తీరు ప్రపంచ చిత్రకారుల్ని అచ్చెరువొందేలా చేసింది.

ఈ చిత్రాన్ని రష్యన్ పార్లమెంట్‌లో కూడా ప్రదర్శించారు.

ఈ అరుదైన గౌరవం తెలంగాణకు చెందిన తొలి తెలుగు వ్యక్తి కాపు రాజయ్యకు దక్కడం యావత్ తెలుగు జాతికే గర్వకారణంగా చెప్పుకోవచ్చు. అతి సామాన్యమైన జీవితాన్ని గడిపిన రాజయ్య 1983 వరకు డ్రాయింగ్ టీచర్‌గానే కొనసాగారు.

తన చిత్రకళా ప్రస్థానంలో రాజయ్య ఎన్నో మైలు రాళ్ళను అధిగమించారు. ఎన్నో రివార్డులు, మరెన్నో అవార్డులు గెలుచుకున్నారు. 1955లో రాజయ్య చిత్రించిన కళాఖండానికి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది.

1975లో చిత్రకళాప్రపూర్ణ, 1988లో భారత ప్రభుత్వం ద్వారా సీనియర్ ఫెల్లోషిప్, 1993లో జేఎన్‌టీయూ ద్వారా కళాప్రవీణ, 1993లో భరతముని అకాడెమీ ద్వారా కళారత్న, ఏఐఎఫ్ఏసీఎస్ ద్వారా కళావిభూషణ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా హంస తో పాటు రాజీవ్ ప్రతిభా పురస్కార్ లాంటి ఎన్నో అవార్డులు పొందారు. 2007లో భారత ప్రభుత్వం రాజయ్యకు లలిత కళారత్న బిరుదునిచ్చి సత్కరించింది.

ప్రపంచంలోని పలు దేశాల్లో రాజయ్య చిత్రాల ప్రదర్శనలు నిర్వహించారు. చెకొస్లావేకియా, హంగరీ, రుమానియా, బల్గేరియా, ఆస్ట్రేలియా, హవానా, క్యూబా, మెక్సికో, లండన్, సీషెల్స్, లాంటి దేశాలతో పాటు మన దేశంలో దాదాపు వంద ప్రదర్శనలు నిర్వహించారు.

జేఎన్‌టీయు వారు చిత్రకళా రంగంలో రాజయ్య చేసిన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ఇచ్చి సన్మానించారు.



ఎన్ని బిరుదులు పొందినా, చిత్రకళారంగంలో మరెవ్వరు అందుకోలేని శిఖరాల్ని చేరుకున్నా రాజయ్య జీవితం మాత్రం చివరిదాకా సాదాసీదాగానే సాగింది. ఆధునిక కళాప్రపంచంలో ఒక్కో కళాఖండం కోట్ల రూపాయల్లో అమ్ముడు పోతూ, చిత్రకారులను కుబేరుల్ని చేస్తున్న నేటి తరుణంలో రాజయ్య సృష్టించిన కళాఖండాలు కీర్తిని తప్ప ఆర్థికంగా సంపాదించిపెట్టకపోవడానికి ప్రధాన కారణం అంత గొప్ప కళాకారుడు తెలంగాణాలో జన్మించడమే అని అభిమానులు ఆవేదనగా చెప్పుకుంటారు.

జీవితంలోని చివరి అంకంలో పార్కిన్‌సన్స్ అనే అరుదైన వ్యాధికి గురైన రాజయ్య తన కళాఖండాల్ని మనకు వారసత్వంగా వదిలి ఆగస్ట్ 20, 2012 నాడు మనకు అందని దూరతీరాలకు తరలి వెళ్ళాడు.

**ముక్తాయింపు:**

ఆంధ్రమహాసభ జీవిత సభ్యులు, ప్రముఖ ఇంజినీరు, ముంబయి నివాసి శ్రీ కుంట మల్లేశం గారి సతీమణి రాజయ్యకు స్వయాన మనుమరాలు.

❋❋❋

**ఈ చిత్రం**

వంద మాటలకంటే ఒక్క వాక్యం శక్తివంతమైనది.. అలాంటి వాక్యాలతో కూడిన ఒక పేజీ కంటే ఒక్క ఫోటో మరెంతో శక్తివంతమైనది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత కొందరు ప్రతిభావంతులు తమ కెమెరా ద్వారా ఎన్నో అద్భుత కళాఖండాలను తమ కెమెరాలో బంధిస్తున్నారు.

ఈ కింది ఫోటోలు చూడండి.. ఎంత అద్భుతంగా ఉన్నాయో..! ఈ ఫోటోలను చూస్తుంటే ఎవరో విదేశీ పర్యాటక ఫోటోగ్రాఫర్ తీసిన చిత్రాల్లా ఉన్నాయి కదూ...





అయితే మీరు తప్పులో కాలేసినట్టే..

ఈ ఫోటోలు తీసింది మరెవరో కాదు. మన ఆంధ్రమహాసభ జీవిత సభ్యుడు పిట్ల రాము.. ఆశ్చర్యంగా ఉంది కదూ..

భవిష్యత్తులో రాము ఇలాంటి మరెన్నో ఉత్తమ చిత్రాలను తన కెమెరాలో బంధించి తెలుగువారి కీర్తిని ఇనుమడింపచేయాలనీ కోరుకుందాం...

## జరిగిన కార్యక్రమాల 'దర్పణం'




ముంబయిలో తెలుగు భాషావికాసంలో భాగంగా ఆంధ్రమహాసభ ప్రతి పౌర్ణమినాడు 'ఎన్నీల ముచ్చట్లు..' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి సభ్యులకు తెలిసిందే.. ఆంధ్రమహాసభ పునాది లక్ష్యాల్లో ఒకటైన సాహిత్యాభిలాషను పెంచడంలో మేం వంతుగా కృషి చేస్తూనే ఉన్నాం.

అదే కోవలో తేది 09.09.2014, మంగళవారం నాడు నిర్వహించిన ఎన్నీల ముచ్చట్లకు ఈ సారి కూడా పలువురు కవులు, సాహితీప్రేమికులు విచ్చేసారు. ముందుగా మహాసభ సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప కార్యక్రమానికి స్వాగతం పలికారు. ఈనాటి కార్యక్రమానికి ఆంధ్రమహాసభ మాజీ మహిలాశాఖ అధ్యక్షురాలు శ్రీమతి పి. భారతలక్ష్మిగారు సభాధ్యక్షులుగా వ్యవహరించారు.

మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్‌గారు మాట్లాడుతూ, 'ఎన్నీల ముచ్చట్లు ఆరంభించడం ఎంతో సంతోషంగా ఉందనీ, అయితే కవులు అనుకున్నంత సంఖ్యలో రాకపోవడం కాస్త నిరుత్సాహాన్ని కల్గిస్తుందనీ, అన్ని ప్రాంతాలకు చెందిన కవులు ఈ కార్యక్రమంలో పాల్గొంటే కార్యక్రమానికి నిండుదనం వస్తుందనీ, ఈ పరాయి ప్రాంతంలోని సాహితీవేత్తలంతా బిందువుల నుండి సింధువులుగా మారాలనీ, అందుక మహాసభ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామనీ..' అన్నారు.

సభాధ్యక్షత వహించిన శ్రీమతి పి. భారతలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నీల ముచ్చట్ల కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలోనే కాళోజీ జయంతి రావడం ఆ మహాకవిని స్మరించుకునేందుకు చక్కని అవకాశం అనీ, కవులంతా ఈ నాటి కార్యక్రమంలో ముందుగా కాళోజీ గురించి మాట్లాడుకుందామని సూచించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మచ్చ ప్రభాకర్ మాట్లాడుతూ, కాళోజీ విశ్వకవి అనీ, ఆయన రాసిన 'నా గొడవ..' నిజానికి సమాజం గొడవే తప్ప కాళోజీ గొడవ కాదనీ, సమాజంలో అందరూ సమానమనే భావన కాళోజీ సాహిత్యంలో స్పష్టంగా తోస్తుందనీ, కాళోజీ గొప్ప మానవతావాది..' అని అన్నారు.



ప్రముఖ కవి, రచయిత సంగెవేని రవీంద్ర మాట్లాడుతూ, 'కాళోజీ కవిత్వం నిత్యనూతనమనీ, ఆయన సౌక్యమైన మనిషనీ, ఎలాంటి ఆడంబరాలు, ఆర్భాటాలు లేని జీవితం ఆయనదనీ..' అన్నారు. కాళోజీ జీవితంలోని పలు మలుపులు, ఆయన కవితాప్రస్థానం, ఆయన జీవితంలోని ఎగుడుదిగుడులు, ఆయన ముక్కుసూటితనం గురించి రవీంద్ర సవివరంగా ప్రస్తావించారు. పైగా కాళోజీ లాంటి మహాకవి గురించి ఒక సమగ్రమైన కార్యక్రమం నిర్వహించేందుకు మహాసభ లాంటి సంస్థలు ముందుకు రావాలనీ పిలుపునిచ్చారు.

మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్ మాట్లాడుతూ, 'సంగెవేని రవీంద్ర ఇచ్చిన సలహాను పాటిస్తామనీ, త్వరలోనే కాళోజీ ఆధారిత ఒక గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తామనీ, అందుకోసం 50వేల రూపాయల్ని కెటాయిస్తామనీ సభాముఖంగా ప్రకటించారు.

తదుపరి మహాసభ కార్యవర్గ సభ్యులు బడుగు విశ్వనాథ్ కాళోజీ జీవిత విశేషాలను వివరించారు. అంతేగాక, పాఠశాలల్లో విద్యార్థులకు తగ్గుతున్న శారీరక వ్యాయామం గురించి, ఈ మధ్యనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల నుద్దేశించి 'మీకు వారంలో ఎన్ని సార్లు చెమటపడుతుందన్న' ప్రశ్నను ఉటంకించి, విద్యార్థుల్లో పలు అంశాలపై అవగాహన పెరగాలనీ సూచించారు.

మహాసభ పరిపాలనాశాక ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్ మాట్లాడుతూ, కాళోజీ కవితాప్రభల గురించి ఎక్కువ అవగాహన లేకపోయినప్పటికీ కాళోజీ మహోన్నత గురించి తెలుసనీ, కాళోజీ ఎంత గొప్ప కవో అంతకంటే గొప్ప మానవతావాదిఅనీ, ఆయన చనిపోయిన తర్వాత తన పార్థివ దేహాన్ని కాకతీయ ఆసుపత్రికి దానం చేసేలా ముందే ఏర్పాట్లు చేసుకున్న గొప్ప మనీషి అని కొనియాడారు.

వర్ధమాన కవి అక్కినపెల్లి దుర్గేశ్ కాళోజీ గురించి ఒక చక్కని కవితను చదివి వినిపించారు. గుర్రం బాలరాజు మండోదరి నిద్ర గురించి దీర్ఘకవితను వినిపించారు. గాలి మురలీధర్ చెట్టుమీద రాసిన కవిత సభికుల్ని బాగా ఆకట్టుకుంది. చెట్టూ చేమలు నశించి పోతున్న తరుణంలో పర్యావరణం పరిరక్షణ అత్యంత అవసరమని తన కవితలో ఆయన పేర్కొన్నారు. సమకాలీన సమస్యపై మురలీధర్ రాసిన కవిత్వం ఆలోచింపచేసింది.

మచ్చ ప్రభాకర్ 'అంతకు మించి చేసిందేమి..' అని సమాజ వికృతులపై ఒక సెటైర్ కవితను వినిపించారు. నడిమెట్ల యెల్లప్ప 'పౌర్ణమి' మీద ఒక చక్కని కవితను వినిపించి ఆకట్టుకున్నారు. సంగెవేని రవీంద్ర 'చిట్లిపోతూ ఒక చిత్రం..' అనే తన కవితలో నర్సరీ నుండి కాలేజి విద్యవరకూ వివిధ స్థాయిల్లో పెరుగుతున్న పోటీ గురించి, పోగొట్టుకుంటున్న బాల్యం గురించి ప్రస్తావించారు.
ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్ మాట్లాడుతూ, సమాజాన్ని తీర్చిదిద్దడంలో గురువుల బాధ్యత ఎంతో ఉందనీ, మాట్లాడిందాన్ని అమలు చేసేందుకు ప్రయత్నించాలనీ, ప్రతిరోజు ఏదో ఒక చిన్నదో పెద్దదో ప్రజా ఉపయోగకరమైన పనిని ప్రతిమనిషి చేస్తే సమాజంలో మంచి అనేది తనంతతానుగా పెరుగుతుందనీ, ఆదర్శాలు వల్లించడం కంటే అమలు చేయడం ముఖ్యమనీ.. అన్నారు.

సాంస్కృతిక విభాగ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య రాఖీ పండగ సందర్భంగా బైరి నర్సయ్య రాసిన ఒక పాటను పాడి వినిపించారు.

మచ్చ ప్రభాకర్ 'మార్కెట్ భర్తలు' అనే శీర్షికతో మరోకవితను వినిపించారు.

మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్ మాట్లాడుతూ, 'ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రుల దృష్టి తమ పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు కావడం పైనే ఉందనీ, కానీ ఒక మంచి మనిషిగా కూడా మారాల్సిన అవసరాన్ని గుర్తించడం లేదనీ, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉందనీ, ప్రస్తుతం విద్యతో సహా ప్రతి ఒక్కటి బ్రాండెడ్‌గా మారి మార్కెట్ వస్తువులుగా మారిపోతున్నాయనీ, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన బిల్ గేట్స్, సత్య నాదెళ్ళ సామాన్యపాఠశాలల నుండి వచ్చిన వారేననీ, ఎక్కడ చదువుతున్నామనీ గాక ఎలా చదువుతున్నామన్నదే ముఖ్యమనీ..' అన్నారు.

చివరగా సభాధ్యక్షురాలు భారతలక్ష్మి మాట్లాడుతూ, 'కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు ఈనాటి సభలో అన్ని రకాల చర్చలు చేపట్టామనీ, ఈ అంశాలన్నీ చర్చల మట్టుకే పరిమితం కాకుండా నిజజీవితంలో అమలు పరచడం ద్వారానే సాహిత్యానికి సమాజానికి సరైన న్యాయం చేసిన వారం అవుతామనీ అన్నారు. ఏది ఏమైనా ఇలాంటి కార్యక్రమాల వల్ల ఒకరకమైన స్ఫూర్తి కలుగుతుందనీ, టీవీల ముందు కూర్చొని చాంతాడులా సాగే సీరియల్స్ చూడడం కంటే ఒక మంచి పుస్తకం చదవడమో, ఇలాంటి సాహితీ చర్చల్లో పాల్గొనడమో చేస్తే ఎంతో బాగుంటదనీ..' భారతలక్ష్మి సూచించారు.

ఈ కార్యక్రమానికి అనుమల్ల రమేశ్ వందన సమర్పణ గావించారు.

## జరిగిన కార్యక్రమాల 'దర్పణం'



తేది 13.09.2014
శనివారం

# సినీ జానపద సాంప్రదాయ నృత్యాలు



ఆంధ్రమహాసభలో నిర్వహించిన సినీ జానపద సాంప్రదాయ నృత్యాలు సభికుల్ని అలరించాయి. శనివారం సాయంత్రం నృత్యాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌కు చెందిన నృత్యశివాలి, నృత్యవిశారద బిరుదాంకితులు కడుమూరి రమేశ్ కోలి అధ్వర్యంలో వారి బృందం నిర్వహించిన నృత్యగాన కార్యక్రమం సభికుల్ని ముగ్దుల్ని చేసింది.

తొలుత ఆంధ్రమహాసభ ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాసభ లక్ష్యాలైన భాషా సాహితీ సంస్కృతుల వారసత్వాన్ని కొనసాగిస్తామనీ హామీ ఇచ్చారు.

సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య మాట్లాడుతూ, ఆంధ్రమహాసభ తరఫున ప్రతి నెల ఒక విశిష్ట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తెలుగువారికి తగినంత వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంచే కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తామనీ అన్నారు.

జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి వాణీ శ్రీపాద తో పాటు ధర్మకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి రాధామోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంయుక్త కార్యదర్శి రాధమోహన్ కడుమూరి రమేశ్ కోలి తెలుగు సాంస్కృతిక వైభవానికి చేస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో తొలుత 'గజానన' అనే ప్రార్ధన గీతంతో ప్రారంభించిన నృత్యపరంపర ఆహుతుల్ని భక్తి ప్రవాహంలోకి తీసుకు వెళ్ళింది. తరువాత 'గజేంద్ర నారాయణ త్రిలోచనాయ' అనే అనే నృత్యనాటకం ప్రేక్షకుల్ని ఆనందడోలికల్లో ముంచెత్తింది.

లల్లాటి బండారా అనే బంజారా లోకనృత్యాలు సభికుల్ని మరోలోకానికి తీసుకు వెళ్ళాయి. ఈ పాటపై కళాకారులు ప్రదర్శించిన నృత్యానికి ఒక మహిళా భావోద్వేగానికి గురై సభాప్రాంగణంలోనే నృత్యానికి పాల్పడడం సభికుల్ని ఆశ్చర్యానికి గురిచేసింది.



బంజారే బంజో అనే జానపద నృత్యానికి సభికులు వన్స్‌మోర్‌లు కొట్టారు. అంతేగాక చిన్నారులు ప్రదర్శించిన ఆధునిక నృత్యాలకు సభికులు ఈలలతో, కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు.





రాధాకో శ్యామ్ యాద్ ఆగయా అనే విరహగీతంలో అమ్మాయిలు ప్రదర్శించిన హావభావాలు సభికుల్ని మరోలోకానికి తీసుకువెళ్ళాయి.

మధ్యలో ధర్మకర్తల మండలి సభ్యులు మార్గం రాజ్‌పాల్ పాడిన 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' అనే పాట ఆహుతుల్లో తన్మయత్వాన్ని కలిగించింది. చివరగా నృత్యబృందం ప్రదర్శించిన 'దశావతారాలు' అనే నృత్యనాటిక ఆనందానికి, ఉత్సాహానికి, భక్తిపారవశ్యానికి పరాకాష్ఠగా నిలిచింది.

చివరగా జరిగిన వేదిక కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విచ్చేసిన సిద్ధివినాయక మందిర ట్రస్ట్ చైర్మెన్ నరేంద్ర రాణేను ఘనంగా సన్మానించారు.

సభాకార్యక్రమంలో వేదికపై ముఖ్యఅతిథి శ్రీపాద వాణి, ధర్మకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్,
సభ్యులు పోతు రాజారాం, మార్గం రాజ్‌పాల్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి రాధామోహన్ తదితరులు ఆసీనులయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథి శ్రీపాద వాణిని ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు సంకు సుధాకర్ మాట్లాడుతూ, మహాసభ గౌరవ ఇతిహాసాన్ని పరిరక్షించుకుంటూ నిత్యనూతన కార్యక్రమాల్ని అందిస్తామనీ, దాంతోపాటే ఆంధ్రమహాసభ పునర్నిర్మాణాన్ని చేపడతామనీ అన్నారు.

ఆద్యాంతం సభికుల్ని కట్టిపడేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారుల్ని ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, నడిమెట్ల యెల్లప్ప, కార్యవర్గ సభ్యులు బడుగు విశ్వనాథ్, తాళ్ళ నరేశ్, కస్తూరి హరిప్రసాద్, రాంపెల్లి జ్ఞానేశ్వర్ తదితరుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

తెలుగు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంఘం, సభ్యులు కొత్తపెల్లి రమేశ్‌బాబులతో పాటు మహిళా శాఖ అధ్యక్షురాలు పద్మా రాజ్‌కుమార్, కార్యదర్శి యత్తం లత, సభ్యులు సంగెవేని విజయ, తురగా జయశ్యామల, బెహరా లలిత తదితరులు పాల్గొన్నారు. సంయుక్త కార్యదర్శి రాధామోహన్ వందన సమర్పణ గావించారు.



## జరిగిన కార్యక్రమాల 'దర్పణం'

**తేది 16.09.2014, మంగళవారం**

## "కృష్ణారావుకు ఘనసన్మానం"



'నిత్యనూతన వార్తలతో పాటు సమసమాజంలోని సమస్యల పట్ల జనసామాన్యంలో అవగాహన పెంచి వారిని ఉద్యమాల బాట పట్టించడమే పాత్రికేయ ప్రధాన కర్తవ్యం..' అని ప్రముఖ కవి, సీనియర్ పాత్రికేయులు ఏ.కృష్ణారావు అన్నారు.

ఆంధ్రమహాసభ వారి ఆహ్వానం మేరకు మహాసభకు విచ్చేసిన కృష్ణారావును ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏక్‌నాథ్ సంగం మరియు సభ అధ్యక్షులు సంకు సుధకర్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల కంటే ఎక్కువగా భాషాభిమానం పరప్రాంతీయులకే ఉందనీ, తెలుగు భాషను పరిరక్షించుకునే ప్రయత్నంలో ప్రతి తెలుగువ్యక్తి పాలుపంచుకోవాలని.. పిలుపు నిచ్చారు. ఢిల్లీకి చెందిన కృష్ణారావు ప్రముఖ రాజకీయ విశ్లేషకులుగా పేరు పొందడమే గాక, 'కృష్ణుడు' పేరుతో ఆయన పలు గ్రంథాలు వెలువరించారు.

తొలుత మహాసభ ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ కార్యక్రమానికి స్వాగతం పలికారు. అధ్యక్షులు సంకు సుధాకర్ మహాసభ తెలుగు భాషా, సాహితీ, కళల వికాసానికి మహాసభ చేస్తున్న కృషిని వివరించారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్, సభ్యులు కొత్తపల్లి రమేశ్‌బాబుతో పాటు కార్యవర్గ సభ్యులు డా॥గుజ్జేటి గంగాధర్, మహిళాశాఖ అధ్యక్షురాలు పద్మారాజ్‌కుమార్, కార్యదర్శి యత్తం లత, సభ్యులు పిల్లమారపు పద్మ, సంగెవేని విజయ, బెహరా లలిత, దమయంతిదేవి, ఏ.మంజులా రెడ్డి, దర్పణం సమన్వయ సంపాదకులు సంగెవేని రవీంద్ర, మాజీ ఉపాధ్యక్షులు మర్రి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ ప్రియులకు శుభవార్త



ముంబయిలోని తెలుగు భాషాభిమానులకు, సాహితీవేత్తలకు, కవులకు, రచయితలకు ఒక శుభవార్త.

ప్రతి పౌర్ణమినాడు 'ఎన్నీల ముచ్చట్లు' పేరుతో ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో ఒక సాహితీకార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇంతవరకు మూడు కార్యక్రమాలు నిర్వహించాం. ముమ్ముందు ఈ ఎన్నీల ముచ్చట్లను మరింత జనరంజకంగా, కవితామయంగా నిర్వహించాలని తలపెట్టాం.

ప్రతి సాహిత్యాభిమాని ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడమే కాకుండా ముంబయిలో తెలుగు భాషావికాసానికి ఆంధ్రమహాసభ చేస్తున్న కృషికి చేయూత నివ్వాలని కోరుతున్నాం.

ఈ కార్యక్రమంలో పలు సాహితీఅంశాలపై స్పందించే అవకాశాన్ని సద్వినయోగపరుచుకోవాలని మా మనవి.

## ఒక మనవి

ఆంధ్రమహాసభ సభ్యులందరికీ సరికొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంకల్పించాం. కావున సభ్యులందరు ఈ క్రింద ఇచ్చిన కూపన్‌లో తమ వివరాలన్నీ స్పష్టంగా ఇంగ్లీష్ భాష లో పెద్ద అక్షరాల్లో పూర్తి చేసి పంపించాలనీ మనవి. వీలైతే ఇదే కూపన్‌ను కట్ చేసి, లేకుంటే ఈ వివరాలన్నీ తెల్లకాగితంపై వివ రంగా రాసి మహాసభ కార్యాలయానికి అందచేయాలనీ మనవి.

పేరు:--------------------------------

పుట్టిన తేది:--------రక్తపు గ్రూపు:------------

చిరునామా:------------------------------

ఫోన్ / సెల్‌నం:------------------------

మెయిల్:-------------------------------

పీజీ/ ఎల్‌జీ/ ఎల్‌ఎల్ క్రమసంఖ్య-----

**తాజా ఫోటో ఒకటి జతచేయగలరు.**

## జరిగిన కార్యక్రమాల 'దర్పణం'

**తేది 28.09.2014, ఆదివారం**


**"వరవపరావు గార్కి ఘనసన్మానం"**



తేది 28.09.2014 రోజున సాయంత్రము 6.30 గంటలకు మహాసభలో ప్రముక కవి రచయిత వర వరరావు గార్కి ఆత్మీయ సన్మానం జరిగింది. ఇట్టి సన్మాన సభలో కాళోజి, వట్టీకోట ఆలువారు స్వామి, దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి, అచ్చమాంబ, నన్నయ లాంటి తెలుగు కవుల గురించి మాట్లాడి వారి జీవిత చరిత్ర గురించి సభికులకు వివరించారు తెలుగు భాష గుర్తింపు మన మూలాలు మరచి పోకుండా మనమే చరిత్రకారులం అనుకుంటే బాగుండదు. తెలుగు వారందరి మనసు బాదపడుతుంది అని వివరించి బాష యాస గురించి కూడా వివరించారు. త్రిలింగ దేశాల చరిత్ర ప్రాంతీయ భాషా తేడాలుంటవి కానీ ఎక్కడి భాష అక్కడి వారిని గౌరవించాలి. మాండలికాలు, జిల్లాల వారిగా మాట్లాడే భాష పలురకాల సాహిత్యం గురించి మాట్లాడారు సభికులకు తన జైలు జీవితానుభావాల గురించి ప్రస్తుతం జరుగుతున్న రాజకీయావ్యవస్థ దాని పరిణామాల గురించి మాట్లాడినారు.

ఇట్టి సన్మాన సభలో అధ్యక్షుడు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, నడిమెట్ల యెల్లప్ప, గట్టు నర్సయ్య, డా॥ గుజ్జేటి గంగాధర్, మహిళశాఖ అధ్యక్షురాలు పద్మ రాజ్‌కుమార్, కార్యదర్శి యత్తం లత, దేవిరావు, తురగ జయశ్యామల, మచ్చ ప్రభాకర్, మండలి రాజయ్య, మహేశ్వరం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.






ఆంధ్ర మహాసభ మహిళాశాఖ ఆధ్వర్యంలో "దసరా సంబురాలు" వేడుకలు అంగరంగ వైభవంగా జరిగినవి. మహిళా శాఖ సభ్యులు జ్యోతి ప్రజల్వన చేశారు. మహిళలందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి, తెలుగుదనం ఉట్టి పడేలా కనిపించారు. బొమ్మల కొలువును అత్యంత వైభవంగా తీర్చి దిద్దారు. మహిషాసుర మర్ధిని, బతుకమ్మ గేయాలు ఆలపించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. బొడ్డు కమలాదేవి పేరు మీద మహిళలకు పసుపు కుంకుమలు ఆంద జేశారు. మహిళాశాఖ తరపున కమలాదేవి కుటుంబ సభ్యులకు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన మహిళలందరికి మహిళా శాఖ అధ్యక్షురాలు పద్మ రాజ్‌కుమార్, కార్యదర్శి యత్తం లత గారు కృతజ్ఞతలు తెలిపారు.









ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమములో పాల్గొన్న కవులతో పాటు అధ్యక్షులు సంకు సుధాకర్

## జరిగిన కార్యక్రమాల 'దర్పణం'



తేది
18.10.2014
శనివారం
'పుటుక్కు జరజర డుబుక్కు మే..'
హాస్యనాటిక



పరుగో పరుగులా మారిన ఆధునిక మనిషి జీవితం పూర్తిగా యాంత్రికంగా మారింది. అనుబంధాలకు, ఆత్మీయతలకు అతీతంగా మనిషి ఏదో తెలియని దానికోసం నిత్యం పరుగులెడుతున్నాడు. రసహీనమై పోయిన నేటి మనిషి జీవితాన్ని హాస్యమొక్కటే ఆహ్లాదకరం చేసే సాధనం. నిజానికి హాస్యం అనేది అన్ని కళల్లో శ్రేష్టమైంది. నవ్వడం, నవ్వించడం ఎలాంటి నష్టం కలిగించని ఒక ప్రాకృతిక వరం. నవ్వగలగడం ఒక యోగం.. భోగం..

ప్రపంచ జీవకోటిలో నవ్వగలిగేది ఒక మనిషొక్కడే.. కానీ ఆ మనిషి నవ్వుల్ని మరిచిపోతున్నాడు.

ఆంధ్రమహాసభ అన్ని రకాల తెలుగు కళల విస్తారానికి కృషి చేస్తున్నట్లుగానే నవ్వించి, జీవితంలో కొన్ని మధుర క్షణాల్ని కల్పించే ప్రయత్నంలో ఉంది. అందులో భాగంగానే 18 అక్టోబర్ 2014 నాడు ఒక హాస్యనాటికను ఏర్పాటు చేసింది. భీమవరానికి చెందిన కళాదీపిక ఆర్ట్స్ వారి 'పుటుక్కు జరజర డుబుక్కు మే..' అనే హాస్యనాటికను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా, మార్కాపురం నియోజక వర్గ ఎమ్మెల్యే జెంకి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత మహాసభ ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథితో పాటు ధర్మకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, సంయుక్త కార్యదర్శి రాధామోహన్ చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనంతరం సంయుక్త కార్యదర్శి రాధామోహన్ 'పుటుక్కు జరజర డుబుక్కు మే...' నాటకం గురించి, కళాబృందం గురించి సంక్షిప్తం పరిచయం చేశారు. విశాఖపట్టణం నుండి వచ్చిన అమతి సుధారాణి ప్రార్ధనాగీతం ఆలపించారు. ఉప్పల కోటేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటకం జనాల్ని అలరించింది. ముఖ్యంగా ఒకే ఒక్క వాద్యపరికరం సహాయంతో, కేవలం నోటి శబ్దాలతో అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ సంగీతాన్ని అందించిన వైజాగ్ రాజు సభికుల మన్ననలు పొందారు. ఈయనకు గతంలో ఏడు నంది అవార్డులు లభించాయి.

ప్రముఖ సినీనటి, నాలుగు సార్లు ఉత్తమ నటి అవార్డు గ్రహీత వై.భవాని ఇల్లాలు పాత్రలో అబ్బురపరిచింది. అంతేగాక, ఈ హాస్యనాటికలో వేల్పుల నాగేశ్వరరావు, కె.దుర్గారావు, ఆళ్ళ సత్యనారాయణ, టి.కృష్ణమూర్తి తదితరులు తమతమ పాత్రల్లో జీవించి సభికుల్ని కడుపుబ్బ నవ్వించారు. ఈ నాటిక తర్వాత నిర్వహించిన సీతారామరాజు నాటికలో ఉప్పాల కోటేశ్వరరావు సీతారామరాజుగా, మోకా నర్సింహస్వామి రూధర్‌ఫర్డ్‌గా, మీసాల జగదీశ్ మేజర్‌గా రసవత్తరమైన నటనను ప్రదర్శించారు. కళారత్న బిరుదాంకిత మిమిక్రీ సుబ్బారావు చేసిన మిమిక్రీ అక్షరాల సభికుల్ని ఆనందడోలికల్లో విహరింపచేసింది.






ఆయన వివిధ యంత్రాల ధ్వనుల్ని అచ్చుగుద్దినట్లు వెలువరించడం ఆశ్చర్యచకితుల్ని చేసింది.

ఈ కార్యక్రమానికి వాషికి చెందిన తెలుగు కళాసమితి ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి కొండారెడ్డి, ప్రముఖ విద్యావేత్త డా॥కెటీవీ రెడ్డి తదితరులతో పాటు ధర్యకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, నడిమెట్ల యెల్లప్ప, పీఆర్వో అల్లం నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు రాంపెల్లి జ్ఞానేశ్వర్, కస్తూరి హరిప్రసాద్, డా॥గుజ్జేటి గంగాధర్, తాటికొండ మోతీరాం, సిరిమల్ల శ్రీనివాస్, కాశిరెడ్డి, మహిళాశాఖ సభ్యులు తురగా జయశ్యామల, మచ్చ సుజాత, దేవీరావులతో పాటు మరెందరో ప్రముఖులు హాజరయ్యారు.

దర్పణం సంపాదక వర్గ సభ్యులు బడుగు విశ్వనాథ్ ఈ కార్యక్రమానికి వందన సమర్పణ గావించారు.



## ఉపన్యాసం



ఆనాటి ఆధ్యాత్మిక ఉపన్యాసం ముగిసింది. వెళ్లేందుకు సిద్ధమవుతున్న శ్రోతలతో ఇలా అన్నాడు ఉపన్యాసకుడు.

'వచ్చేవారం అబద్ధం ఆడడం ఎంత పాపమో తెలుసుకు ందాం. అది తెలుసుకునే ముందు మీరంతా భగవద్గీత 19వ అధ్యాయాన్ని చదివి రాగలిగితే ఆనందిస్తాను. భగవద్గీతలోని 19వ అధ్యాయం చదివితే నా ఉపన్యాసం మీకు చాలా సులభం గా అర్ధమవుతుందని నా భావన...'

'తప్పకుండా గురూజీ..' అన్నారు శ్రోతలు.

వారం గిర్రున తిరిగిపోయింది.

ఆధ్యాత్మిక ఉపన్యాసానికి సిద్ధమవుతూ ఇలా అడిగాడు ఉపన్యాసకుడు.

'భగవద్గీతలోని 19వ అధ్యాయం ఎంత మంది చదివా రో చేతులెత్తండి...'

అంతా చేతులెత్తేశారు. ఆశ్చర్యపోయాడు ఉపన్యాసకు డు. తర్వాత సన్నగా నవ్వుతూ ఇలా అన్నాడు.

'భగవద్గీతలో ఉన్నవి 18 అధ్యాయాలే... 19వ అధ్యా యం లేనే లేదు. లేని అధ్యాయాన్ని మీరు ఎలా చదివారు..? అంటే మీరంతా అబద్ధం ఆడారన్న మాట. ఇప్పుడు మనం అబద్ధం ఆడితే ఎంత పాపమో తెలుసుకుందాం..' అంటూ ఉపన్యాసం ప్రారంభించాడతను..








## తెలుగు భాంధవులందరికీ

# కార్తీకమాసం శుభాకాంక్షలు



**Venkateshwar Yapuram**
General Secretary
The Bombay Andhra Mahasabha & Gymkhana



**Jilla Govardhan**
BOT - Chairman



**Pitla Balakrishna**
Trustee Member



**Perla Vithal**
Trustee Member



**Dyavarishetty Gangadhar**
Trustee Member

# Padmashali Mitra Mandali, Mumbai

# HORIZON GROUP

Builders & Developers





A-245, Balaji Bhavan,
Plot No. 42A,
Sector-11,
CBD Belapur,
Navi Mumbai - 400 614

**Tel.: 022-27560442**
**E-mail: reddymk@gmail.com**
**www.horizonlivingspaces.com**

Advt.